## న్యూ ఇయర్ తీపి కబురు ..!

### డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు మరమ్మతులు షురూ

**నందిగామ డిసెంబర్ 29 ప్రభాతవార్త:** ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు సర్పంచ్ కమ్ముకృష్ణ న్యూ ఇయర్లో తీపి కబురు అందించనున్నారు. ఏళ్ల తరబడి నిరీక్ష ఒదిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక చొరవతో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మరమ్మత్తు పనులు చేపట్టినట్లు చెప్పారు. సంక్రాంతి లోగా కొత్త ఇళ్లల్లో పాలు పొంగించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఉప సర్పంచ్ వెంకటేష్ ,వార్డు సభ్యులతో కలిసి సోమవారం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించి మరమ్మతుల పనులు చేపట్టారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగిస్తూ ట్రాక్టర్ డోజర్ తో చదును చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ మల్లికార్జున్ రెడ్డి, వార్డు సభ్యులు అగ్గి ప్రవీణ్, బొమ్మగల్ల నర్సింలు, శివగళ్ల సురేష్, శివగళ్ల ప్రవీణ్, కిట్టు,అగ్గి మమతసూరి, నాయకులు పిట్టల రాములు,ఎర్రగారి రమేష్, శివగళ్ల సుమన్, రహమతల్లి, రెడ్డేమోని నర్సింలు, అగ్గి శ్రీశైలం తదితరులున్నారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## ఫోక్సో కేసులో నిందితుడికి 20 ఏండ్ల జైలు

**మేడ్చల్, డిసెంబరు 29. ప్రభాతవార్త :** మైనర్ బాలికలపై లైంగిక నేరాలకు కఠిన శిక్షలు తప్పవని మేడ్చల్ న్యాయస్థానంలో ఇచ్చిన తీర్పు మరో సారి స్పష్టం చేసింది. మైనర్ బాలికపై లైంగిక దాడికేసులో మేడ్చల్ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. వివరాల ప్రకారం మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో క్రైం నంబర్ 533/2022 కేసులో నిందితుడుగా ఉన్న ఒరిస్సా రాష్ట్రానికి చెందిన బికాస్ కుమార్ నాయక్ అలియాస్ సమీర్, అలియాస్ బబున (40) అనే వ్యక్తి ఓ మైనర్ బాలికను అపహరించి ఆమె పై పలు మార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు కోర్టులో రుజువైంది. నిందితుడు చేసిన నేరాలు విచారణలో తేలిన కారణంగా ఫోక్సో సెక్షన్ చట్టం 5(1) భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 366, 376(2) (ఎన్) ప్రకారం అత్యాచార నేరాలకు గాను 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ 5వేలు జరిమానా, జరిమానా చెల్లించలేనిఎడల మరో సంవత్సరం జైలు శిక్ష విధిస్తూ మేడ్చల్ ప్రత్యేక ఫోక్సో కోర్టు న్యాయమూర్తి వెంకటేష్ తీర్పు ఇచ్చారు. అదే విధంగా అపహరణ కేసులో 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ 2 వేలు జరిమానా, జరిమానా చెల్లించలేని ఎడల 6 నెలల అదనంగా జైలుశిక్షతో పాటు బాధిత బాలికకు రూ 5లక్షల పరిహారం చెల్లించాలని న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ ఫోక్సో చట్టం కింద నమోదయ్యే ఏ నేరంలో కూడ కోర్టులు ఏ మాత్రం సానుభూతి చూపవని, ఈ తీర్పు మైనర్ బాలికల రక్షణకు, మహిళలభద్రతకు గట్టి హెచ్చరికగా అనిపిస్తుందని అభిప్రాయపడ్డారు.

# యూరియా కొరత లేదు

**రంగారెడ్డిఅర్బన్, డిసెంబరు29, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లాలో యూరియాకొరత లేదని జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లావ్యాప్తంగా యూరియా సరఫరా పూరి స్థాయిలో కొనసాగుతోందని తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేస్తున్న అన్ని యూరియా పంపిణీ కేంద్రాలకు అవసరమైనంత స్టాక్ అందుబాటులో ఉందని పేర్కొన్నారు. రైతులకు సౌకర్యవంతంగా, క్రమబద్ధంగా యూరియా పంపిణీ జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే రైతులకు స్పష్టంగా కనిపించే విధంగా స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. విక్రయ కేంద్రాలకు యూరియా సరఫరా తగినంతగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎక్కడా అంతరాయం లేకుండా స్టాక్‌ను అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, అవసరమైన యూరియా పూర్తిగా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు. యూరియా పంపిణీలో ఎలాంటి అవక తవకలు జరగకుండా పర్యవేక్షణ మరింత కట్టుదిట్టంగా చేపడతామని తెలిపారు.



మాట్లాడుతూన్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి

## ప్రజావాణికి 40 ఫిర్యాదులు

### ప్రజా సమస్యల పరిష్కరానికే ప్రజావాణి

**రంగారెడ్డిఅర్బన్, డిసెంబరు29, ప్రభాతవార్త:** ప్రజల సమస్యల సరిష్కరం కోపమే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించి ప్రజావాణి కార్యక్రమానికి 40 ఫిర్యాదులు అందాయన్నారు. జిల్లాలోని వివిధప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్‌సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసంనిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిశాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను అధికారులు పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖ-21, ఇతర శాఖలు 19, మొత్తం 40 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదిదారుల పట్ల మర్యాదగా నడుచుకోవాలి

### -జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

**ధారూరు, డిసెంబరు 29, ప్రభాతవార్త:** స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల విషయంలో మర్యాదగా వ్యవహరించాలని, వారిచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించి వారికి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అన్నారు. సోమవారం ధారూర్ సర్కిల్ కార్యాలయంతో పాటు సర్కిల్ పరిధిలోని ధారూర్, కోట్ పల్లి, బంట్వారం పోలీస్ స్టేషన్ ల ు జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ రికార్డు, పరిసరాల ు పరిశీలించారు. పెండింగ్ లో ఉన్న కేసుల వివరాలు అడిగి తెలుసుకొని వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ, ముఖ్యంగా స్టేషన్‌లో ఎలాంటి ఫైళ్ల ు పెండింగ్‌లో ఉంచకూడదని, కేసుల దర్యాప్తు ు వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం చేకూరేలా చూడాలని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యల ు ఓపికగా విని తక్షణమే స్పందించాలని ఆదేశించారు. ప్రజలతో మమేకమై పనిచేస్తూ, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం కృషి చేయాలని ఎస్పీ గారు పిలుపునిచ్చారు. అసాంఘిక కార్యక్రమాలపై నిగా ఉంచాలని, ప్రజల్లో భద్రత భావాన్ని పెంపొందించాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేయాలి చెప్పారు. ఈ కార్యక్రమంలో ధారూర్ సీఐ రఘురాం, కోట్‌పల్లి ఎస్ఐ శైలజ, విమల పోలీస్ సిబ్బంది ఉన్నారు.



ధారూర్ సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించి, సిఐ రఘురాంతో మాట్లాడుతున్న ఎస్పీ స్నేహమెహ్రా

## ప్రజావాణిలో ఏడు ఫిర్యాదులు

**మేడ్చల్, డిసెంబరు 29, ప్రభాతవార్త:** జిహెచ్‌ఎంసీలో మేడ్చల్ మున్సిపల్ విలీనమైన అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన మేడ్చల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఏడు ఫిర్యాదులు వచ్చాయి. పలు సమస్యలపై డిప్యూటి కమిషనర్ సుదంశ్‌కు వినతులు అందజేశారు.



ఎఐ టెక్నాలజీ ద్వారా చిరుతపులి (ఫేక్) చిత్రాన్ని తయారు చేసి వాట్సప్ గ్రూపుల్లో వేసిన ఫోటో దృశ్యం

# చిరుత సంచారం ఫేక్..

**.వాటప్స్ గ్రూపుల్లో పంపిన యువకున్ని పట్టుకుని క్రిమినల్ కేసు నమోదు చేసిన పోలీసులు**

**..శామీర్‌పేట చెరువు వద్దకు చిరుతపులి (ఫేక్) వచ్చిందని ఎఐ టెక్నాలజీ ద్వారా చిత్రాన్ని తయారు చేసి వాట్సప్ గ్రూపుల్లో వేసిన యువకునిపై కేసు నమోదు ..ఈ విషయం చర్చనీయాంశంగ మారిన వైనం**

**..అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవు..శామీర్‌పేట సిఐ శ్రీనాథ్**

**శామీర్‌పేట, డిసెంబరు 29, ప్రభాతవార్త :** శామీర్‌పేట పెద్ద చెరువు వద్దకు చిరుతపులి (ఫేక్) వచ్చిందని బీహార్‌కు చెందిన ఓ యువకుడు ఫేక్ సమాచారాన్ని వాట్సప్ గ్రూపుల్లో పంపటంతో శామీర్‌పేట పోలీసులు, ఫారెస్ట్ అధికారులు ఆ యువకున్ని గుర్తించి శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వాట్సప్‌లో వచ్చిన సమాచారంతో ప్రజలు పలువురు భయబ్రాంతులకు గురయ్యారు. సోమవారం సాయంత్రం సంఘటన చోటు చేసుకుంది. శామీర్‌పేట పోలీసుల కథనం ప్రకారం శామీర్‌పేట పెద్ద చెరువు వద్దకు ఒక చిరుతపులి వచ్చిందని చిరుతపులితో కూడినటువంటి ఏఐ టెక్నాలజీ ద్వారా ఒక చిత్రాన్ని తయారు చేసి దానిని వాట్సప్ గ్రూపులలో పంపటం ద్వారా స్థానిక ప్రజలు, చుట్టుపక్కల ప్రజలు భయంబ్రాంతులకు గురికావటంతో పోలీసులు, అటవీ సిబ్బంది హుటాహుటిన అట్టి స్థలాన్ని సందర్శించి అక్కడ ఎలాంటి పులి ఆనవాళ్లు లేవని నిర్ధారించుకుని ఇట్టి చిత్రాన్ని పంపించినటు వంటి రవీందర్‌కుమార్ అనే వ్యక్తి (యువకున్ని) గుర్తించి అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఇలాంటి అసత్యపు చిత్రాల ద్వారా వార్తల ద్వారా ప్రచారం చేసి ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగ ఎవరైనా ప్రయత్నిస్తే వారిపై చట్టరీత్య క్రిమినల్ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని శామీర్‌పేట పోలీస్ ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ స్పష్టం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**షాబాద్, డిసెంబరు 29, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు బీహార్ రాష్ట్రం పాట్నాకు చెందిన బిపిన్ కుమార్ (21) నాగర్ కుంట గ్రామానికి చెందిన పాలమాకుల రమేష్ డైరీ ఫామ్ లో నెల జీతం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి షాబాద్ లోపని ముగించుకొని తిరిగి డైరీ ఫామ్ కు బైక్పై వెళుతుండగా షాబాద్ రోడ్డుపై రిపేర్ కోసం డిసిఎం లారీ ఆగి ఉంది. లారీకి ఎలాంటి సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో ముందు ఉన్న లారీని గమనించకుండా వేగంగా ఢీకొట్టడంతో బిపిన్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి స్వగ్రామానికి పంపించి వేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కబ్జారాయుళ్ల చేతుల్లో మాయమౌతున్న వాగులు

- -పత్తాలేని ఇరిగేషన్ అధికారులు
- -చెక్‌డ్యామ్ సైతం మింగేశారు
- -అధికారుల ప్రమేయం లేకుండానే ఇంతజరిగేనా ?
- -గ్రామ అధికారులు వెలితే మా సారే కమిషనర్
- -ఆపేది లేదంటు బెదిరింపులు

**మొయినాబాద్, డిసెంబరు 29, ప్రభాతవార్త :** కబ్జారాయుల చేతుల్లో మాయమౌతున్న వాగులు, చెక్‌డ్యామ్‌లు, భూ దాహంతో నాలాలను మింగేస్తున్నారు. అధికారుల ప్రమేయం లేకుండానే ఇంత జరిగేనా అంటు స్థానికులు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా పత్తాలేని ఇరిగేషన్ అధికారులు, మొయినాబాద్ మండలంలోని కనకమామిడి రెవెన్యూలో సర్వే నెం 510లో నాలా ప్రారంభమై సర్వే నెంబర్ 488, 487, 486, 492, 491 పలుసర్వే నెంబర్‌లలో నుండి వాగు షాపూర్ రెవెన్యూలో ప్రవేశించి చివరకు గండిపేట చెరువులోకి వర్షపునీరు పెద్ద ఎత్తున వెళ్తుంది. అయితే చేవెళ్ల బీజాపూర్ రహదారి పనులు వేగం పెంచడంతో జెసిబిలు నడిచినా చూసినవారు ఏదో రోడ్డు పనులు అనుకుంటారనే ఉద్దేశ్యంతో ఇదే అదునుగా చేసుకొని హైద్రాబాద్‌కు చెందిన కొంత మంది కబ్జాకోరులు సర్వే 488, 487, సర్వే నెంబర్‌లలో ఉన్నటువంటి పట్టాదారులు పూర్తిగా జెసిబిలతో నాలాను కబ్జాచేసి వారి భూముల్లో కల్పుకుంటున్నారు. ఇదంతా చూసిన గ్రామస్తులు ఇంత పెద్ద ఎత్తున ఎక్కడో హైద్రాబాద్ నుండి వచ్చి ఇదంతా చేస్తున్నారు, పశువులకు, త్రాగడానికి, చెక్‌డ్యామ్‌లలో ఎల్లప్పుడు నీరు నిల్వ ఉండేది, అలాంటిది చెక్‌డ్యామ్‌లను సైతం తీసివేస్తుంటే స్థానిక అధికారుల ప్రమేయం లేకుండా పోలేదని గ్రామస్తులు వాపోతున్నారు.



పెద్దవాగును జెసిబితో పిల్లకాలువలా మార్చిన దృశ్యం



వాగులో ఉన్న చెక్‌డ్యామ్‌ను పూడ్చుతున్న దృశ్యం

**చెక్‌డ్యామ్ సైతం మింగేస్తున్నారు :** సర్వే నెంబరు 487లో ఉన్న వాగుపై గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కట్టిన చెక్‌డ్యామ్ ను కూడ పూడుస్తుండగా అక్కడికి వెల్లిన రెవెన్యూ గ్రామ జిపివో అధికారులు జెసిబిని ఆపవల్సిందిగా సదరు వ్యక్తులను ప్రశ్నించగా వారు తిరిగి అధికారులకు ఇది ప్రభుత్వంలో పనిచేస్తున్న ఓ ఉన్నత అధికారిది, మా సారే కమిషనర్ మీరు ఏమిచేసినా మేము ఆపేది లేదంటు ఎదురు మాటల యుద్ధానికి దిగారు. ఏమైనా ఉంటే మాసార్ చూసుకుంటాడు, ఇప్పుడు పని ఆపేదిలేదని బెదిరింపులు చేస్తున్నారు.

**పత్తాలేని ఇరిగేషన్ అధికారులు :** మండలంలో కళ్లముందు నాళాలు ఆక్రమ కబ్జాకు గురైతుంటే ఇరిగేషన్ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడంత గమనార్హమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఉన్నత అధికారులు స్పందించాలి:** ఎవరికి వారు చెరువులు వాగులను కబ్జాచేస్తే ఎలా అంటు ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలంలో వర్షపు నీరు, గొలుసుకట్టు చెరువుల ద్వారా, చిన్నచిన్న వాగుల ద్వారా వర్షపు నీరు గండిపేట చెరువుకు చేరుతుంది. చెరువుకు వచ్చే వర్షకు ఎలాంటి అడ్డంకులు ఏర్పడకూడదనే ఉద్దేశంతో జీవో 111ను ఏర్పాటుచేసారు. వాగులపై ఎలాంటి అడుగోడలు కట్టకూడదని కాని ఏకంగా వాగులను కబ్జాచేస్తుంటే స్థానిక అధికారుల పట్టించుకోవడంలేదని, ఉన్నత అధికారులు స్పందించి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని నాలాను పరిరక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# పెద్దేముల్‌లో యువకుడి హల్‌చల్

..తమకు న్యాయం జరగాలంటటూ వాటర్ ట్యాంక్ పైకి ఎక్కిన యువకుడు
..పోలీసులు, నాయకులు, గ్రామస్థులు సముదాయించిన వినకుండా మొండికేసిన వైనం !



వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కిన యువకుడు



సముదాయిస్తున్న ఎస్ఐ, సర్పంచ్, గ్రామస్థులు



కబ్జాకు గురైన స్థలాన్ని జెసిబితో తొలగిస్తున్న దృశ్యం

**పెద్దేముల్, డిసెంబరు 29, ప్రభాతవార్త:** పెద్దేముల్‌లో ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. తమకు న్యాయం జరగాలంటూ వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కి హల్‌చల్ సృష్టించాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ శంకర్, గ్రామ సర్పంచ్ డివై నర్సిములు, గ్రామస్థులు ఎంత చెప్పిన వినకుండా వాటర్‌ట్యాంక్‌పైనే ఉండిపోయాడు. వివరాల ప్రకారం.. పెద్దేముల్ గ్రామానికి చెందిన మోసిన్ అనే యువకుడు తమ సమస్య పరిష్కరించి తమకు న్యాయం చేయాలంటు డిమాండ్ చేస్తు వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కాడు, ఈ సందర్భంగా వాటర్ ట్యాంక్‌పై నుంచి మోసిన్ మాట్లాడుతూ గతంలో 1 వార్డు కాలనీలో ఉన్న బాటను గ్రామానికి చెందిన ఓ నాయకుడు కబ్జాచేశారు. బాటను కబ్జా చేయడంతో తమతో పాటు అటుగా నడిచే గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తమకు ఇబ్బందులు ఎదురై న్యాయం చేయాలని అడిగితే తమపై దాడికి దిగుతున్నారని ఆందోళన వ్యక్తంచేశాడు. అందుకోసం తాను వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కానని, తమ సమస్యను పరిష్కరించే వరకు వాటర్ ట్యాంక్ దిగే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఎవరైన ట్యాంక్‌పైకి ఎక్కే ప్రయత్నం చేస్తే పైనుంచి దూకుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో పోలీసులు, నాయకులు, గ్రామస్థులు ఎంతచెప్పిన వినకపోవడంతో చేసేదేమి లేక సర్పంచ్ డివై నర్సిములు కబ్జాకు గురైన స్థలాన్ని జెసిబితో తొలగించారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఇతర అధికారులు

## ప్రజావాణి ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి

**వికారాబాద్, డిసెంబరు 29, ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజాఫిర్యాదుల ు సత్వరమే పరిష్కరించాలని జిల్లాకలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశమందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 75 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యల ు కలెక్టర్, అదనపు కలెక్టర్ సుదీర్, ఇంచార్జి అదనపు కలెక్టర్ రాజేశ్వరి, డీఆర్ఓ మంగిలాల్, ఆర్డీఓ వాసుచంద్ర, డీఆర్‌డీఓ శ్రీనివాస్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. పెన్షన్, వ్యవసాయం, గృహనిర్మాణ శాఖ, భూ సమస్యలకు సంబంధించిన పిర్యాదులు వచ్చాయని, అట్టి ఫిర్యాదుల ు పెండింగ్‌లో ఉంచకుండా సమస్యల ు సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ అధికారుల ను ఉద్దేశించి మాట్లాడుతూ, జిల్లాలో అరవ తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు జిల్లా ఆరోగ్య వైద్య శాఖా అధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బిసి, ఎస్సి, అన్ని ప్రభుత్వ హాస్టల్స్ కేజీబీవీల లో ఉండేవిద్యార్థులు ఉచిత కంటి పరీక్షలు చేసుకోవాలని తెలిపారు. కంటి సమస్యలు ఉన్న వారికీ సరైన చికిత్స, కళ్ళ అద్దాలు, మందులు ఇవ్వడం జరుగుతుందని, ఫిబ్రవరి 15 వరకు ఈ పరీక్షలు నిర్వహించబడతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ బాబోయ్.. మళ్ళీ కాలుష్య భూతం..

-పోరాటాలు చేసిన కనిపించని ఫలితం.. -పాపిరెడ్డి గూడ స్పాంజ్ ఐరన్ పరిశ్రమతో పచ్చని పంటలు నాశనం -మధురాపురం రైతు అమరనాథ్‌రెడ్డి ఆందోళనతో వెలుగులోకి - రాత్రివేళ రహస్యంగా బయటకు కాలుష్యపు పొగ.. -గతంలో పోరాటం చేసిన న్యాయవాది దివంగత వీరేందర్ రెడ్డి, రైతులు -హైకోర్టు ఆదేశాలను సైతం బేఖాదర్ చేస్తున్న పరిశ్రమ నిర్వాహకులు -కాలుష్యంతో ఎనిమిది గ్రామ పంచాయతీలు సతమతం -రోగాల బారిన పడుతున్న జనం- ప్రాణాలు కోల్పోతున్న పశుసంపద

**షాద్‌నగర్, డిసెంబరు 29, ప్రభాతవార్త :** దశాబ్దాల కాలంగా కాలుష్య భూతం కోరలు చాస్తోంది.. పచ్చని పంటలను నాశనం చేస్తుంది.. ప్రజలను రోగాల వారిని పడేస్తోంది.. పాడి ఇచ్చే పశువులను పుట్టన పెట్టుకుంటుంది.. ఈ దారుణాన్ని ఆపాలని దశాబ్దాల కాలంగా రైతులు పోరాటం చేస్తూనే ఉన్నారు.. అయినా ఫలితం శూన్యం.. రాత్రివేళ రహస్యంగా బయటకు వస్తున్న పొగ కాలుష్యం పచ్చని పంటలను సర్వనాశనం చేస్తూ 8 గ్రామ పంచాయతీల పరిధిలో రైతులను నానా అవస్థలకు గురిచేస్తుంది. కేశంపేట మండల పరిధిలోని ఇప్పలపల్లి వద్దగల స్పాంజ్ ఐరన్ కాలుష్య పరిశ్రమ ద్వారా రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఇది. ఫరూక్ నగర్ మండలం మధురాపురం గ్రామానికి చెందిన రైతు లక్మాపురం అమరనాథ్ రెడ్డి ఈ కాలుష్యాన్ని మళ్లీ ఒకసారి తెరపైకి తీసుకురావడంతో విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ సమస్య ఈనాటిది కాదు.. ఎప్పటినుంచో పోరాటాలు, ఉద్యమాలు జరుగు తున్నాయి.. అయినా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. ఇక్కడి రైతాంగాన్ని కంటికి కునుకు లేకుండా చేస్తున్న ఇప్పలపల్లి స్పాంజ్ పరిశ్రమ తీరుతెన్నులపై ఒక్కసారి గతంలోనూ, వర్తమానంలోనూ ఈ పరిశ్రమ కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు తెర తీస్తే..



**పోరాటాల జీవితంగా..**

సకాలంలో కురవని వర్షాలు.. అతివృష్టితో ఇబ్బందులు.. చేతి కందని పంటలు.. అందిన సహకరించని ధరలు.. ఇలా నిత్యం రైతు జీవితం ఒక పోరాటమే.. అలాంటిది ఇప్పలపల్లి, పాపిరెడ్డి గూడ, వేముల నర్వ, మధురాపురం, శేరిగూడెం, తదితర పంచాయతీల ప్రజలు వీటితోపాటు కాలుష్యంతో కూడా నిత్య పోరాటం చేయాల్సిన పరిస్థితి. విపరీతమైన పొగ కాలుష్యంతో చుట్టుముట్టు పండించిన పంటలు పూర్తిగా మసిబారిపోవడం, ధాన్యం నలుపెక్కిపోవడం, పత్తి రంగు మారిపోవడం, తాగునీరు కలుషితమై పశువులు చనిపోవడం, ప్రతి చెట్టు ఆకుపై నల్లని పొగలేనువులు పెరుగుపోవడం కిరణజన్య సంయోగ క్రియ జరగకపోవడం, ప్రజలు అనారోగ్యాల బారిన పడటం ఇది నిత్య దృశ్యంగా మారింది. ఈ క్రమంలో రైతులు పలు పోరాటాలు చేసినా, అధికారులు పరిశీలన చేసినా, నాయకులు హడావిడి చేసినా చివరికి పరిశ్రమ యాజమాన్యం చేతి ఆమ్యామాలతో అంతా సర్దుకుపోయేది. దీనితో పోరాటం చేసే రైతులకు తిరిగి అదే కాలుష్యం.. అదే కష్టం.. ఇది దశాబ్ద కాలంగా జరుగుతున్న చరిత్ర



అమర్నాథ్ రెడ్డి

**వీరేంద్రుడి పోరాటం..**

ఇదిలా ఉంటే రైతుల తరఫున వకాల్తా పుచ్చుకొని సీనియర్ న్యాయవాది దివంగత తాండ్ర వీరేందర్ రెడ్డి చేసిన పోరాటం ఎప్పటికీ గుర్తుంటుంది. 8 గ్రామ పంచాయతీల రైతులను ఏకం చేసి పరిశ్రమపై యుద్ధం ప్రకటించిన ఆయన చివరికి హైకోర్టులో కూడా దీనిపై సవాలు చేశాడు. రైతుల వాదనలు విన్న హైకోర్టు పరిశ్రమ కాలుష్యం నిజమేనని నిర్ధారించుకొని రైతులకు పరిహారాలు ఇవ్వాలని, కాలుష్య నివారణ యంత్రాలు వాడాలని పరిశ్రమకు సూచించింది. కానీ ఈ రెండింటిలోనూ ఒక్కటి కూడా అమలులోకి రాలేదు. తర్వాత కాలంలో అనారోగ్యం బారిన పడి దివంగత వీరేందర్ రెడ్డి కన్నుమూసిన తర్వాత పరిశ్రమ నిర్వాహకుల విచ్చలవిడితనం మరీ ఎక్కువైపోయింది. ఇక తమను అడిగేది ఎవరులే అనుకొని విచ్చలవిడిగా కాలుష్యాన్ని వదులుతున్నారు. పంటచేలను నాశనం చేస్తున్నారు. ఇప్పుడు హైకోర్టు ఆదేశాలు కూడా మళ్లీ ఒకసారి బేఖాతర్ అవుతున్నాయి.

**ఇదీ పరిస్థితి..**

ప్రస్తుతం కురిసిన వర్షాలకు పంటలు మంచి దశలో ఉండి రైతులు సంతోషిస్తున్న తరుణంలో పరిశ్రమ వదులుతున్న కాలుష్యం నిద్ర లేకుండా చేస్తుంది. రాత్రి వేళల్లో రహస్యంగా వదులుతున్న పరిశ్రమ పొగ కారణంగా పచ్చటి ఆకులు నలుపు రంగుకు మారుతున్నాయని, ఈ దుర్వాసన భరించలేక రోగాల బారిన పడుతున్నామని, పశువులు కూడా మరణిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధురాపురం గ్రామానికి చెందిన రైతు లక్నాపురం అమర్నాథ్ రెడ్డి దీనిపై స్పందిస్తూ గతంలో ఎన్నోసార్లు పోరాటం చేసిన ఫలితం లేకుండా పోయిందని అన్నారు. కొంతమంది యూనియన్ లీడర్లు, నాయకులు, గ్రామాల సర్పంచులు పరిశ్రమ వద్ద హడావిడి చేసి ఆ తరువాత పరిశ్రమ నిర్వాహకులకు ఏదో ఒక రూపంలో లొంగిపోతున్నారని ఆరోపించారు. ఒక వీరేందర్ రెడ్డి మాత్రమే నిజాయితీగా పోరాటం చేశారని ఆయన గుర్తు చేశారు. ఇకనైనా నాయకులు, అధికారులు స్పందించి పరిశ్రమల్లో కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాలుష్యం బారి నుండి తమను మళ్లీ కాపాడాలని రైతు అమర్నాథ్ రెడ్డి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

## దాయాదుల మధ్య ఘర్షణ - ఒకరు మృతి

**జిల్లేడు చౌదరి గూడెం, డిసెంబర్ 29, ప్రభాతవార్త :** భూతగాదాలలో ఇద్దరు అన్నదమ్ముల మధ్య జరిగిన గొడవలో అన్న మృతి చెందిన సంఘటన జిల్లేడు చౌదరిగూడ మండలంలోని పీర్జాపూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వెంకటయ్య, రాములు ఇద్దరు అన్నదమ్ములు. భూతగాదాలతో ఇద్దరు గొడవ పడ్డారు. తమ్ముడు రాములు పిడిగుద్దులు గుద్దడంతో వెంకటయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటయ్య భార్య నర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఈనెల 31 నుంచి కందుల కొనుగోలు

**కొడంగల్, డిసెంబరు 29, ప్రభాతవార్త :** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన కందులను ఈనెల 31 నుంచి కొనుగోలు చేయనున్నట్లు కొడంగల్ మార్కెట్ కమిటీ సెక్రటరీ దేవదత్తు,ఎపిఎం గోపాల్,సిసి అరవింద్‌లు తెలిపారు.సోమవారం మాట్లాడుతూ... ఈనెల 31 నుంచి నాఫెడ్,మండల మహిళ సమాఖ్య అధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు తెలిపారు.స్దానిక మార్కెట్ యార్డులో ప్రభుత్వ మద్దతుధర క్వింటాలుకు రూ.8వేలు చెల్లించనున్నట్లు తెలిపారు.ఎకరాకు గరిష్టంగా 8క్వింటాళ్ళు మాత్రమే కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు.కాగా 12 శాతం మాయిశ్చర్ తప్పనిసరి అని హమాలీ రైతులే భరించాల్సి ఉంటుందన్నారు.పంట సాగు వివరాలు ఆన్‌లైన్‌లో ఉండాలని,అగ్రికల్చర్ అధికారులు ధృవీకరణ తప్పనిసరి వారు తెలిపారు.కందుల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## వ్యక్తిని ఢీకొన్న మోటార్ వెహికల్ - ఒకరి మృతి

**పరిగి, డిసెంబరు 29, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా పరిగి మండలం బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ చేకూరి సుభానయ్య ఆటోస్టాండ్ వద్ద ఆటోను నిలిపి రోడ్డు దాటుతుండగా అటు నుంచి టీఎస్ 34కె 2552 నెంబర్‌గల మోటార్ వెహికల్ వేగంగా యువకుడు నడుపుతూ సుభానయ్యను ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయం అవడంతో స్థానికులు పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని తెలియడంతో ఆసుపత్రి డాక్టర్లు చికిత్స నిమిత్తం వికారాబాద్ వెళ్లాల్సిందిగా కుటుంబ సభ్యులకు తెలిపారు. వికారాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినాడు. సుభానయ్య భార్య మంజుల బైక్ నడిపిన యువకుడు వరుణ్‌పై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌హెచ్‌ఓ మోహనకృష్ణ తెలిపారు.

## ట్రాక్టర్ ఇసుక కోసం రూ.1800 చెల్లించాలి

..తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్

**పెద్దేముల్, డిసెంబరు 29, ప్రభాతవార్త:** ఒక్క ట్రాక్టర్ ఇసుక కోసం రూ. 1800 చెల్లించాలని తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా రవాణ చేసిన ఇసుకను పోలీసులు సీజ్ చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న ఇసుకను వేలం వేస్తున్నట్లు తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్ తెలిపారు. ఒక్కొ ట్రాక్టర్ ఇసుక కోసం రూ. 1800 చెల్లించి అనుమతులు పొందాలని అన్నారు. ఇసుకను పొందేందుకు ఆసక్తి కలవారుమండల తహసిల్దార్ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.



శోభన్ బాబును సన్మానిస్తున్న ఎస్సై వెంకటేష్

## హెడ్ కానిస్టేబుల్ శోభన్ బాబు బదిలీ

**ఆమనగల్లు, డిసెంబరు29, ప్రభాతవార్త:** ఆమనగల్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ శోభన్ బాబు బదిలీ అయ్యారు. సైబరాబాద్ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ కు ఆయన బదిలీపై వెళుతున్నారు.గత రెండు సంవత్సరాలుగా ఆమ నగల్ పోలీస్ స్టేషన్లో శోభన్ బాబు హెడ్ కానిస్టేబుల్‌గా సమర్థవంతమైన విధులు నిర్వహించి మన్ననలు పొందారు. ఈ సందర్భంగా ఆమనగల్లు ఎస్సై బి వెంకటేష్ ఆధ్వర్యంలో స్టేషన్ సిబ్బంది శాలువా పూలమాలలతో శోభన్ బాబును సత్కరించి ఆయన సేవలపై ప్రశంసలు కురిపించి అభినందించారు.

## తాండూరులో మందుబాబులకు భారీ జరిమానా

**తాండూరు, డిసెంబరు29, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా తాండూరులో మందుబాబులకు భారీ జరిమాన విధించారు. తాండూరు పట్టణంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వాహన దారులకు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నరేందర్ 48మందికి రూ.74వేల జరిమాన విధించినట్లు సిఐ సంతోష్‌కుమార్ ఓ ప్రకటనలో వెల్లడించారు. పట్టణంలో ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపిన. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినా వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.




ఎమ్మార్వో కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న ప్లాట్ల యజమానులు

## మా ప్లాట్లను ఆక్రమించారు..!

**-న్యాయం కోసం ఎమ్మార్వో కార్యాలయం ముందు ఆందోళన -పోలీసు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు**

**నందిగామ, డిసెంబరు29, ప్రభాతవార్త:** తమ ప్లాట్లను ఆక్రమించారని నిరసిస్తూ సోమవారం స్వాతి వేణుగోపాల్ నగర్ ప్లాట్ల యజమానులు తహసిల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. నందిగామ రెవిన్యూ పరిధిలో ఉన్న సర్వేనెంబర్ 1554,1555,1597,1615,1621నుండి 1627వరకు,1629,1642నుండి 1649 వరకు1669 తదితర సర్వే నెంబర్లలో 2003 2006 సంవత్సరంలో ప్లాట్లను కొనుగోలు చేశామన్నారు. ఇట్టి ప్లాట్ల హద్దుల రాళ్లను ధ్వంసం చేశారని, ఫ్రీ కాస్ట్ వెయ్యనివ్వడం లేదని,ఇదేమి దౌర్జన్యమని ప్రశ్నించిన బెదిరింపులకు పాల్పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. మండలానికి చెందిన మోహన్ సింగ్, ఇంతియాజ్, ముషారఫ్,సులోచన, సుస్మిత లు తమ ప్లాట్లను ఆక్రమించారని పోలీసు,రెవెన్యూ అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పు సప్పు చేసి , ఎన్నో కష్టాలు పడి ప్లాట్లు కొంటే ఇబ్బందుల పాలు చేస్తున్నారని,న్యాయం కోసం ఎమ్మార్వో, పోలీస్ అధికారులకు ప్లాట్ల యజమానులు ఎం విజయ, రామ శ్రీ, శేషమాంబ,సరళ, నాగమణి తదితరులు మొరపెట్టుకున్నారు.



ఎమ్మార్వో కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న ప్లాట్ల యజమానులు

# ముంచుకొస్తున్న మున్సిపాలిటీ ఎన్నికలు

-షాద్‌నగర్‌లో రిజర్వేషన్లపై అభ్యర్థుల్లో ఉత్కంఠ..
-సమాయత్తమవుతున్న కాంగ్రెస్, బిఆర్ఎస్ శ్రేణులు..
-"చైర్మన్ సీటే" లక్ష్యంగా ఇరు పార్టీల పోరాటం..
-గతంలో బిఆర్ఎస్ దెబ్బకు రెండు స్థానాలపై పరిమితమైన కాంగ్రెస్..
-ఈసారి ప్రతీకారం తీర్చుకుంటుందా..?
-షాద్‌నగర్ మున్సిపాలిటీలో మొదలైన ఎన్నికల చర్చ..




షాద్ నగర్ మ్యాప్



పట్టణ ముఖచిత్రం

**షాద్‌నగర్, డిసెంబరు 29, ప్రభాతవార్త :** సర్పంచ్ ఎన్నికల సందడి పూర్తయిపోయింది.. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల సందడి మొదలైంది.. జనవరిలో నోటిఫికేషన్ వస్తుంది.. ఫిబ్రవరిలో ఎన్నికలు పూర్తవుతాయని సంకేతాలు పార్టీ వర్గాలకు వస్తుండడంతో ఇప్పటినుండే ఆశవాహులు తమ దుకాణాలు సర్దుకుంటున్నారు. ఒకవైపు రిజర్వేషన్ల కేటాయింపు పై అభ్యర్థుల్లో ఉత్కంఠ.. మరోవైపు ఎన్నికల్లో ఆధిపత్యాన్ని చాటడంపై అటు కాంగ్రెస్, ఇటు బిఆర్ఎస్ లలో వ్యూహాలు, ఓటు బ్యాంకును పెంచుకునే దిశగా బిజెపి అడుగులు.. ఈ నేపథ్యంలో ఎక్కడ చూసిన ఇదే చర్చ. పట్టణ పరిధిలో జరిగే ఎన్నికలు కావడంతో ఈ ఎన్నికలపై మరింత ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఒక్కసారి గత ఎన్నికలను, వర్తమాన పరిస్థితులను నెమరు వేసుకున్నట్లయితే..

**గత ఎన్నికలు ఇలా..**

2019లో జరిగిన షాద్‌నగర్ మున్సిపాలిటీ ఎన్నికలను తీసుకుంటే మున్సిపాలిటీలో 28 వార్డులకు పోటీ జరిగింది. మొత్తం 42 వేల134 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా ఇందులో పురుషుల సంఖ్య 21, 412 మహిళల సంఖ్య 20,720 ఇతరులు ఇద్దరు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రిజర్వేషన్లకు సంబంధించి 7,9,26,16,24,28 వార్డులు జనరల్ కు కేటాయించగా 18,8,6, 23,20,25,2,10 వార్డులను జనరల్ మహిళలకు కేటాయించారు. ఇక బీసీలకు సంబంధించి మొత్తం 11 స్థానాలు రిజర్వ్ చేయగా ఇందులో 1,17,4,21,13,14 వార్డులు బిసి పురుషులకు 12,19,11,27,22 వార్డులు బిసి మహిళలకు కేటాయించారు. ఇక 3వ వార్డు ఎస్సి పురుషుడికి, 15వ వార్డు ఎస్సి మహిళలకు కేటాయించారు. ఐదవ వార్డు ఎస్టీకి కేటాయించడం జరిగింది. 6657 మంది ఓసి పురుషులు,6260 మంది ఓసి మహిళలు, 13068 మంది బిసి పురుషులు, 12777 మంది బీసీ మహిళలు, 602 మంది ఎస్టి పురుషులు, 518 మంది ఎస్టి మహిళలు, 1085 మంది ఎస్సి పురుషులు, 11 67 మంది ఎస్సి మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక ఆసక్తికరంగా సాగిన ఈ పోటీలో బిఆర్ఎస్ ఘనవిజయం సాధించింది. 28 స్థానాలలో 25 స్థానాలను సాధించి చైర్మన్ కైవసం చేసుకుంది. కాంగ్రెస్ కేవలం రెండు సీట్లకు పరిమితం కాగా, ఎమ్ఐ ఎమ్ ఒక స్థానాన్ని పొందింది. పురపాలక చైర్మన్ గా కొందూటి నరేందర్, వైస్ చైర్మన్‌గా ఎమ్మెస్ నటరాజన్ పదవులు పొందారు.

**ఇక వర్తమానం లోకి వస్తే..**

**కాంగ్రెస్ దెబ్బ కొడుతుందా..**

గత ఎన్నికల నాటికి పరిస్థితి వేరు.. కీలకమైన నాయకులంతా బిఆర్ఎస్ పార్టీ వైపు వెళ్లిపోవడంతో కాంగ్రెస్ పార్టీ ఒంటరి పక్షి గా మిగిలిపోయింది. దీనితో ఆశించిన స్థాయిలో ఓట్లు రాక అన్నిచోట్ల దెబ్బతిన్నది. కానీ ఈసారి పరిస్థితి ఎలా కాదు.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఒక్కొక్క ఇటుక పేర్చి పార్టీని పటిష్టంగా మార్చారు. ఫలితంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రాగలిగారు. ఈ విడత కాంగ్రెస్ అన్ని రకాలుగా వార్డుల వారీగా పటిష్టంగా ఉంది. అలాగని బిఆర్ఎస్‌ను కూడా తక్కువ అంచనా వేయడానికి వీలులేదు. వార్డుల వారీగా జనం ఆదరించే నాయకులు ఆ పార్టీలో కూడా ఉన్నారు. దీనితో సర్పంచ్ ఎన్నికల తరహాలోనే పోటీ రసవత్తరంగా సాగుతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎక్కువ స్థానాలు సాధించి చైర్మన్ స్థానాన్ని ఎవరు కైవసం చేసుకుంటారు అనే దాని మీదే ప్రస్తుతం చర్చ నడుస్తుంది. బలంగా ఉన్న రెండు పార్టీలు ఢీ అంటే ఢీ అంటూ ముందుకు సాగు అవకాశం అయితే స్పష్టంగా ఉంది. బిజెపి కూడా పురపాలక పరిధిలో అంతో ఇంతో ఓటు బ్యాంకు ఉన్న పార్టీ కాబట్టి ఆ పార్టీ నుంచి కూడా అభ్యర్థులు పోటీలో ఉండడం సహజం. అయితే స్థానాల కన్నా ఈ పార్టీ అవతలి రెండు పార్టీల గెలుపు ఓటములను శాసించే పరిస్థితి తప్పకుండా ఉంటుంది. ఎన్నికల శంఖారావం మోగడానికి సమయం దగ్గర పడుతుండడంతో అన్ని పార్టీలు పోటీకి సమాయత్తమవుతున్నాయి.

**ఆ పొరపాట్లు సరి చేస్తారా..**

పోటాపోటీగా ఢీకొట్టే కాంగ్రెస్, బిఆర్ఎస్ లలో సర్పంచ్ ఎన్నికల్లో జరిగిన కొన్ని పొరపాట్లు ఇరు పార్టీలకు నష్టం చేకూర్చాయి. కాంగ్రెస్ విషయానికి వస్తే రెబల్స్ రంగంలో ఉండడం ఆ పార్టీకి తలనొప్పిగా మారింది. పలుచోట్ల బీఆర్ఎస్ గెలుపుకు ఇది దోహదం చేసింది.రెబల్స్ బెడద లేకుండా చేసుకుంటేనే కాంగ్రెస్ పార్టీ చైర్మన్ కుర్చీని సాధించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇక టిఆర్ఎస్ విషయానికి వస్తే మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిల మధ్య అగాధం సర్పంచ్ ఎన్నికల్లో ఆ పార్టీకి నష్టం చేకూర్చింది. ఈ మున్సిపల్ ఎన్నికల్లో నైనా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు వ్యవహరించకుండా కలిసికట్టుగా పనిచేస్తేనే కాంగ్రెస్ ను దీటుగా ఎదుర్కొన్నందుకు అవకాశం ఉంటుంది. మరి ఈ విషయంలో అగ్ర నాయకత్వం చొరవ చూపుతోందా.. కాంగ్రెస్ కు గట్టి పోటీ ఇస్తుందా.. అన్నది వేచి చూడాలి.

# మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

-పర్సాపూర్‌లో ఇందిరమ్మ చీరెల పంపిణీలో సర్పంచ్





ఉడిమేశ్వరంలో మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీనివాస్

**కొడంగల్,డిసెంబరు 29, ప్రభాతవార్త :** మహిళల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని పర్సాపూర్,ఉడిమేశ్వరం గ్రామాల సర్పంచ్‌లో కన్నం రాధమ్మ,కె.శ్రీనివాస్ అన్నారు.సోమవారం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్‌లు కన్నం రాధమ్మ,కె.శ్రీనివాస్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నదని,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి,రూ.500లకే గ్యాస్ సిలెండర్‌లు అందిస్తున్నదని చెప్పారు. అలాగే మహిళలకు వడ్డీలేని రుణాలు,ఆర్టీసీకి అద్దెబస్సులు తదితరపథకాలను అమలు చేస్తున్నదని గుర్తు చేశారు.సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మహిళలకు నాణ్యమైన ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్నదని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బెస్త శివమ్మ,వార్డు సభ్యులు జి.సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్న సర్పంచ్

## ఈర్లపల్లిలో ఇందిరమ్మ చీరెల పంపిణీ

**దౌల్తాబాద్,డిసెంబరు 29,ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండలంలోని ఈర్లపల్లి గ్రామంలో సోమవారంరోజు గ్రామ సర్పంచ్ బోయిని పద్మ వెంకట్‌రాములు ఆధ్వర్యంలో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ..అర్హులైన ప్రతీ ఒక్కరికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను అందించడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ మహిళా సంఘం అధ్యక్షులు లక్ష్మి,మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గుట్టుగా గంజాయి దందా .!

-- ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు..
-- రూ.52వేల విలువైప 1800 గ్రాముల గంజాయి స్వాధీనం
-- 'వార్తా' పత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన పోలీసులు



నిందితున్ని అదుపులోకి తీసుకొని వివరాలు వెల్లడించిన ఎస్ఐ అంబర్యా

**తాండూరు, నవంబరు 29, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరులో గంజాయి దందా గుట్టుగా సాగుతుంది. 'వార్తా' పత్రికలో "పోలీసులుకు సవాల్".. గంజాయి బ్యాచ్.. అంటూ వచ్చిన కథనానికి పోలీసులు స్పందించారు. పట్టణంలో గంజాయిబ్యాచ్‌పై నిఘా పెంచారు. సోమవారం పట్టణ ఎస్ఐ అంబర్యా ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో తనిఖీలు చేపట్టారు. నమ్మదగిన సమాచారం మేరకు రైల్వే స్టేషన్ సమీపంలో మహామ్మద్ షకీల్ పాషా అనే వ్యక్తివద్ద తనిఖీ చేయగా సుమారు 1800 గ్రాముల ఎండు గంజాయి లభించింది. అయితే, హైదరాబాద్ మలక్‌పేట్‌లో నివాసముంటున్న మహమ్మద్ షకీల్ తాండూరులో కూరగాయల వ్యాపారం చేస్తూ గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కర్ణాటక రాష్ట్రం బీదర్ పట్టణంలోని ఇరాని గల్లి నుండి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని పోలీసులు వెల్లడించారు. గంజాయి విలువ రూ.52వేలు ఉంటుందని అన్నారు. నిందితునిపై ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ అంబర్యా తెలిపారు.



వార్డు సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ నీరటి లక్ష్మీ

## గ్రామ అభివృద్ధికి సహకరించాలి

: సర్పంచ్ నీరటి లక్ష్మీ శ్రీనివాస్

**ధారూరు, డిసెంబరు 29, ప్రభాతవార్త:** గ్రామ అభివృద్ధికి వార్డు సభ్యులు సహకరించాలని నాగారం సర్పంచ్ నిరటి లక్ష్మి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ధారూర్ మండల పరిధిలోని నాగారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణ ఆధ్వర్యంలో వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలోని ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజా సమస్యల ు తీర్చిదిద్దుతానన్నారు. గ్రామంలోని రోడ్ల పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి ఉంటుందని చెప్పారు. త్వరలో గ్రామంలో సీసీ కెమెరాలు, వీధి దీపాల ు ఏర్పాటు చేస్తామని అన్నారు. గ్రామానికి ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కారోబార్ ఆనంద్, ఉప సర్పంచ్ ఏ ుగుల శ్రీనివాస్, వార్డ్ సభ్యులు అఫ్రోజ్, నీరటి నరసింహులు, కవిత, నూర్జహా, మమత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తోరుమామిడిని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతా

-తోరుమామిడి సర్పంచ్ సంజీవ్



గ్రామ సమస్యలపై ధరఖాస్తు స్వీకరిస్తున్న సర్పంచ్ సంజీవ్

**బంట్వారం. డిసెంబరు 29. ప్రభాతవార్తః** తోరుమామిడి గ్రామాన్ని ఆదర్శ గ్రామ సర్పంచ్‌గా తీర్చి దిదుతానని నూతనంగా ఎన్నికైన సర్పంచ్ సంజీవ్ అన్నారు.

సోమవారం ఆయన గ్రామ పంచాయితీ కార్యాలయంలో మీడియాతో మాటట్లాడుతూ,పంచాయతీ కార్యాలయం నుంచి నేరుగా ప్రజా సమస్యలు వింటూ సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

పంచాయతీ కార్యాలయం నుంచి నేరుగాని ప్రజల ను కలుస్తూ సమస్యల ు తెలుసుకుంటూ ప్రతి వార్డులోని సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజలందరి సహకారంతో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుటకు నా వంతు కృషి చేయడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. ప్రతినిత్యం పంచాయతీ కార్యాలయంలోనే ప్రజలకు అందుబాటులో ఉంటానని గ్రామ సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావచ్చని అన్నారు. గ్రామంలో ప్రధాన సమస్యలు మంచినీటి సమస్య వీధిలైట్లు మురుగు కాలువలు వంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సర్పంచ్ గా తనకు పట్టగట్టిన గ్రామ ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మన గ్రామం అభివృద్ధి చెందాలంటే పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకరిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలాగా కృషి చేయడం జరుగుతుందని అన్నారు.



మెడిసిటి ఆస్పత్రిలో స్సూపర్ స్పెషాలిటి బ్లాక్‌ను ప్రారంభిస్తున్న లోటస్ గ్రూప్ ఆప్ హాస్పిటల్ ఫర్ ఉమెన్ చిల్డన్ వ్యవస్థాపకులు విఎస్‌వి ప్రసాద్

## మెడిసిటి ఆస్పత్రిలో సూపర్‌స్పెషాలిటి బ్లాక్ సేవలు

**మేడ్చల్, డిసెంబరు 29. ప్రభాతవార్త :** మెడిసిటి ఆస్పత్రిలో సూపర్‌స్పెషాలిటీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని ఆస్పత్రిలోని షెర్ మెడికల్ కేర్ ఫౌండేషన్ ప్రసిడెంట్ శివరామ కృష్ణ తెలిపారు. ఎల్లంపేట మున్సిపాలిటి పరిధిలోని ఘన్‌పూర్‌లో గల మెడిసిటి ఆస్పత్రి ఆవరణలో సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌ను సోమవారం లోటస్ గ్రూప్ ఆప్ హాస్పిటల్ ఫర్ ఉమెన్ చిల్డ్రన్ వ్యవస్థాపకులు విఎస్‌వి ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడిసిటి ఆస్పత్రి గత రెండు సంవత్సరాలుగా వైద్య సేవలు అందిస్తున్నదని, ప్రస్తుతం ఇక్కడి ప్రాంత ప్రజలకు మెరుగైన చికిత్స అందించడానికి ప్రత్యేక సూపర్ స్పెషాలిటి బ్లాక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రస్తుతం కార్డియాలజీ, న్యూరాలజీ, యూరాలజీ, వ్యాస్కులర్ సర్జరీ వంటి సేవలను అందుబాటులోకి తెచ్చామని త్వరలోనె ఇతర సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను ప్రారంభించేందుకు సన్నాహలు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో షేర్ మెడికల్ కేర్ ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాస్ రాజు, మెడిసిటి ముఖ్య కార్యనిర్వహణాధికారి ఐనిష్ మర్చంట్, ప్రిన్సిపల్ దేవేంద్రసింగ్, మెడికల్ డైరెక్టర్ గీత తదితరులు పాల్గొన్నారు.

# చైనీస్ మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు

-జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

**వికారాబాద్, డిసెంబరు 29, ప్రభాతవార్త :** గాలిపటాలు ఎగురావేయడానికి చైనిస్ మాంజాను ఉపయోగించవద్దని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైనీస్ మాంజా విక్రయించడం, నిల్వ చేయడం, వాడటంపై ప్రభుత్వం నిషేధం విధించిందని, పర్యావరణానికి, పక్షులకు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్న ఈ ప్రమాదకరమైన మాంజా ను విక్రయించడం చట్టరీత్యా నేరమని ఎస్పీ పేర్కొన్నారు. ఈ దారం గాలిపటాలు ఎగురవేసే సమయంలో మెడకు లేదా శరీర భాగాలకు తగిలితే తీవ్రమైన గాయాలు కావడమే కాకుండా ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని, గతంలో ఇలాంటి ఘటనలు ఎన్నో చోటుచేసుకున్నాయని ఆమె గుర్తు చేశారు. జిల్లాలోని ఫ్యాన్సీ షాపులు, గాలిపటాల విక్రయ కేంద్రాలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతారని, ఎక్కడైనా నిషేధిత చైనీస్ మాంజా కనిపిస్తే వెంటనే వాటిని సీజ్ చేయడమే కాకుండా సంబంధిత విక్రేతలపై కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. కేవలం వ్యాపార లాభాల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని ఆమె వ్యాపారులకు సూచించారు. పర్యావరణ హితమైన, సురక్షితమైన నూలు (కాటన్) దారాల ు మాత్రమే విక్రయించాలని, వాటినే కొనుగోలు చేయాలని ఎస్పీ కోరారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పట్ల ఇట్టి విషయం పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా ఎవరైనా రహస్యంగా చైనీస్ మాంజా విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డైల్ 100 కు సమాచారం అందించాలని ఎస్పీ జిల్లా ప్రజల ు కోరారు.



జిల్లా ఎస్పీ స్నేహమెహ్రా

# మైనింగ్ పాలసీ మార్చండి..

## -కర్ణాటక కంటే అధిక భారం -అసెంబ్లీలో ఎమ్మెల్యే మనోహర్

**ప్రభాతవార్త, డిసెంబరు 29 ,వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** జిల్లాలో మైనింగ్ పాలసీ మార్చాలని తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి కోరారు. సోమవారం అసెంబ్లీ సమావేశంలో తాండూరు, వికారాబాద్, కొడంగల్ నాపరాయి (షాబాద్ స్టోన్) సంక్షోభంపై ఆయన మాట్లాడారు. రాయల్టీ వసూళ్లలో కర్ణాటక కంటే తెలంగాణలో అధికంగా ఉందన్నారు. విద్యుత్ బిల్లులు తడిసి మోపెడు అవుతున్నాయని చెప్పారు. దానివల్ల వ్యాపారులు కొన్ని తప్పిదాలు చేయాల్సి వస్తోందన్నారు. పరిశ్రమ ఇబ్బందుల్లో ఉన్నందున వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. గతంతో పోల్చుకుంటే కొంతకాలంగా వ్యాపారులు ఆర్థికంగా చితికిపోతున్నారని తెలిపారు. కూలీలకు ఉపాధి తగ్గుముఖం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ కుటుంబాలు రోడ్డున పడకుండా చూడాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. రెండు రాష్ట్రాలలో అమలు చేస్తున్న వ్యత్యాసం, విధానాలపై అధ్యయనం చేసి మైనింగ్ పాలసీ మార్చాలని కోరారు. రాజస్తాన్ మార్బుల్స్, టైల్స్‌కు మార్కెట్లో అధిక గిరాకీ లభిస్తున్నందున నాపరాయి వ్యాపారులు నష్టపోతున్నారని తెలిపారు. రాయల్టీ, విద్యుత్ ఛార్జీలలో సడలింపులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ భవనాలకు, ఇతరత్రా నిర్మాణాలకు తాండూరు బండలు ఉపయోగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో వైయస్ రాజశేఖరరెడ్డి సిఎంగా ఉన్నపుడు మైనింగ్‌శాఖ మంత్రి సబితారెడ్డి విజ్ఞప్తి మేరకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో తాండూరు నాపరాయి ఉపయోగించారని గుర్తు చేశారు. మళ్లీ అలాంటి ఉత్తర్వులు రావాలని సంబంధిత శాఖ మంత్రిని ఆయన కోరారు.

## కుష్టు వ్యాధి వ్యాప్తి, నివారణపై అవగాహన పెంచుకోవాలి

### మండల వైద్య అధికారి కిరణ్ కుమార్ గౌడ్

**కుల్కచర్ల, డిసెంబరు 29, ప్రభాతవార్త:** కుష్టు వ్యాధి వ్యాప్తి, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని మండల వైద్య అధికారి కిరణ్ కుమార్ గౌడ్ అన్నారు.సోమవారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో వైద్య సిబ్బందితో సరే చేయించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వారు నిర్ధారణ పరీక్ష చేయించు కోవాలన్నారు.మెరుగైన వైద్యం తీసుకుంటే వ్యాధి తొందరగా నయం అవుతుందని సూచించారు.ఈ వ్యాధి లక్షణాలు స్పర్శలేని మచ్చలు, గోధుమ రంగు మచ్చలు, రాగి రంగు మచ్చలు ఉంటే వైద్య సిబ్బందికి తెలుపాలని సూచించారు.కుష్టు వ్యాధి ఉన్న వారు నిర్లక్ష్యం వహిస్తే నరాల లోపలికి వెళ్లి నరాల బలహీనంగా మారడం,పక్షవాతం సంభవించే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

## చకచకా సాగుతున్నఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు

### మీడియాకు నిర్మాణ పనుల వీడియో విడుదల

**షాద్‌నగర్, డిసెంబరు 29, ప్రభాతవార్త :** షాద్ నగర్ నియోజకవర్గంలోని కొందుర్గు మండలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం పనులు చక చక కొనసాగుతున్నాయని ఫరూక్ నగర్ మాజీ జెడ్పిటిసి, కాంగ్రెస్ నాయకుడు పి వెంకట్రాంరెడ్డి పేర్కొన్నారు. పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి శాసనమండలిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులు జరగడంలేదని పనులు ప్రారంభించలేదని ప్రశ్నించారని వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడడం సరికాదని వెంకటరామిరెడ్డి హితవు పలికారు. పనులు ఏనాడూ ప్రారంభం అయ్యాయని ఒక్కసారి వచ్చి చూస్తే తెలుస్తుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాంతంలో మొట్టమొదట ఇంటిగ్రేటెడ్ పాఠశాలను స్వాహస్తాలతో ప్రారంభించారని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో దాదాపు 250 కోట్ల రూపాయల విలువైన ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వం పూర్తి కసరత్తు చేస్తుందని పనులు చురుకుగా కొనసాగుతున్నాయని వెంకటరామిరెడ్డి గుర్తు చేశారు. పనులు ప్రారంభించాలని శాసనమండలిలో అర్థరహితంగా మాట్లాడడం సరికాదని ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి సూచించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న పాఠశాల నిర్మాణం పనుల వీడియోలు విడుదల చేశారు.



వెంకట్రాం రెడ్డి మాజీ జెడ్పిటిసి

## చేగూర్,చించోడు,మొగిలిగిద్దలను మండలాలుగా ఏర్పాటు చేయాలి

### తెలంగాణ రాష్ట్ర శాసనమండలిలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

**షాద్‌నగర్, డిసెంబరు 29, ప్రభాతవార్త :** చిన్న మండలాలతోనే అభివృద్ధి, మరియు మౌలిక వసతుల ఏర్పాటు సాధ్యమని ప్రజల ప్రజలు కోరుకుంటున్నారని షాద్ నగర్ నియోజక వర్గంలోని చేగూరు,చించోడు మరియు మొగిలిగిద్ద గ్రామాలను మండలాలుగా ఏర్పాటు చేయాలని అక్కడ ప్రజలు కోరుకుంటున్నారని శాసనమండలిలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ప్రజల తరఫున తన వాయిస్ ని వినిపించారు.అంతేకాకుండా ఏడాది క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు వచ్చి ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు శంకుస్థాపన చేసిన కూడా ఇప్పటివరకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుపై ఎటువంటి పనులు జరగకపోవడం బాధాకరమని, దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులని ప్రారంభించాలని ప్రభుత్వానికి తెలియజేశారు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి.



నవీన్ రెడ్డి ఎమ్మెల్సీ

## మంచినీటి పైప్ లైన్ విస్తరణ పనులను ప్రారంభించిన ఇంచార్జ్ కవిత

**నందిగామ, డిసెంబరు 29, ప్రభాతవార్త :** నందిగామ మండలం వెంకమ్మగూడలో మిషన్ భగీరథ పైప్ లైన్ విస్తరణ పనులను సర్పంచ్ గొర్లపల్లి అశోక్ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఇంచార్జ్ కవిత పైప్ లైన్ విస్తరణ నిర్మాణ పనులకు పూజలు చేశారు. గ్రామంలో బురుజు మైసమ్మ ఆలయం నుంచి సింబయాసిస్ వెళ్లే రహదారి మీదుగా గుండాల చంద్రుడు ఇంటి వరకు విస్తరణ పైప్లైన్ పనులను వేస్తున్నట్లు సర్పంచ్ అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు, గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వెంకమ్మగూడలో పనులను ప్రారంభిస్తున్న మిషన్ భగీరథ అధికారి కవిత

## కెసిఆర్‌ను కలిసిన బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ

**కొత్తూరు, డిసెంబరు 29 ప్రభాతవార్త:** హైదరాబాద్ నంది నగర్‌లోని తన నివాసంలో సోమవారం తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును కొత్తూరు మండలం ఎస్‌బి పల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కొత్తూరు మండలంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించడం జరిగిందని తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేయడం, క్షేత్రస్థాయిలో కార్యకర్తలను చురుకుగా ఉంచే అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ఎమ్మె సత్యనారాయణతో జరిగిన సమావేశం బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపిందని, కెసిఆర్ చెరువుతో రానున్న రోజుల్లో కొత్తూరు మండల బిఆర్ఎస్ పార్టీ మరింత బలపరిచే అవకాశాలు ఉన్నాయంటూ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.



కెసిఆర్‌తో ఎమ్మె సత్యనారాయణ

## నీటి సమస్యను పరిష్కరించాలి

### ప్రజావాణిలో బిజెపి నాయకుల వినతి

**మేడ్చల్, డిసెంబరు 29. ప్రభాతవార్త :** మేడ్చల్, పూడూర్ కిష్టాపూర్ డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ బిజెపి అధ్యక్షురాలు శైలజా హరినాథ్ ఆధ్వర్యంలో మేడ్చల్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో డిప్యూటీ కమిషనర్ సుదంశ్‌కు ఆ పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. గత కొన్ని సంవత్సరాలు ఈ డివిజన్ల ప్రజలు నీటిసమస్యతో బాధ పడుతూ ట్యాంకర్ల నీటిని కొనాల్సిన పరిస్థితి వచ్చిందని వినతిలో పేర్కొన్నారు. నాలుగైదు రోజులకు ఒక్కసారి నల్లా నీరు వస్తుందని, ఈ సమస్యను వేసవికాలానికి ముందే పరిష్కరించి ప్రజలకష్టాన్ని దూరం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మురళీధర్ గుప్త, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి వంశీ విజయ్, నాయకులు సుధాకర్‌రెడ్డి, మోహన్‌రావు, నాగేశ్వర్ రావు, రాగం అర్జున్, హరిబాబురెడ్డి, రాఘవరెడ్డి, చీర్ల సత్యనారాయణ, సర్వేశ్వర్‌రెడ్డి, విష్ణు గౌడ్, సురేందర్‌రెడ్డి, నవీన్, అర్జున్, నర్సింగ్‌రావు, మహేష్, అవినాష్ చారీ, ఈశ్వర్, బాబు రాజు, పురుషోత్తం, నవీన్ చారీ తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్‌లోనే జోనల్ కార్యాలయాన్ని ఉంచాలి

**అత్తాపూర్ డిసెంబరు 29,ప్రభాతవార్త :**

రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి కార్యాలయంలోనే జోనల్ ఆఫీస్‌ను నిర్వహించాలని పలువురు డిమాండ్ చేశారు.సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ ఆఫీస్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సర్కిల్ ఆఫీస్ మరియు జోనల్ ఆఫీస్ ఇక్కడే నిర్వహించాలని వేరే ప్రాంతానికి ఎట్టి పరిస్థితిలో తరలించోద్దని సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డిని కలిసి అంబేద్కర్ సంగం అధ్యక్షులు, సర్కిల్ మహనీయుల జయంతుల వ్యవస్థాపక అధ్యక్షులుపోయిల జీవన్ దాస్ ఆధ్వర్యంలో అధ్యక్షులు ఎడ్లకాడి సూర్యం ,మాజీ అధ్యక్షులు గోల్కొండ రాజు కుమార్ ,డిప్యూటీ కమిషనర్ లు వినతిపత్రం అందజేశారు.



- అగ్నిమాపకశాఖ చోద్యం
- నోటీసులకే సరి.. చర్యలపై లేదు గురి
- విద్యా, ఆసుపత్రుల యాజమాన్యాల ఉదాసీనత
- ప్రాణాలు పోతేగానీ స్పందించలేరా ?

# ఫైర్‌సేఫ్టీ ప్రశ్నార్థకం

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 29, ప్రభాతవార్త :** అగ్నిప్రమాదాలను అరికట్టేందుకు సరిపడా పరికరాలను అమర్చు కోవడంలో పలు ప్రైవేటు సంస్థలు ఉదాసీనధోరణి ప్రదర్శిస్తున్నాయి. స్కూళ్లు, కాలేజీలు, నర్సింగ్‌హోములు, లఘు పరిశ్రమలలో ఫైర్ సేఫ్టీ పరికరాలను అమర్చుకుని నివారణ చర్యలు చేపట్టాలి. కానీ చాలా సంస్థలలో ఇవేమీ లేకుండానే దందాలు చేపడుతున్నట్లు తెలిసింది. ఒకవేళ ప్రమాదం సంభవించి భారీ ఎత్తున ప్రాణనష్టం వాటిల్లితే బాధ్యత ఎవరు వహిస్తారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఇటీవల చేవెళ్ల వద్ద ఆర్టీసీ బస్సు ప్రమాదం తర్వాత వివిధశాఖల అధికారులు హల్‌చల్ చేసి ఉల్లంఘనులపై కొరడా ఝుళిపించారు. కానీ అక్కడ భారీగా ప్రాణనష్టం జరిగింది. రోడ్లు సరిగ్గా లేకపోవడం, నిబంధనలు అతిక్రమించి ఓవర్ లోడ్ తరలించడం, సీట్ల కెపాసిటీకి మించి ప్రయాణికులను రవాణా చేయడం, రవాణా శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వంటి వైఫల్యాలు కనిపిస్తున్నా ఇప్పటి వరకు ఒక్క ప్రభుత్వ అధికారి, ఉద్యోగిపైనా చర్యలు చేపట్టలేదు. పైగా ప్రమాదానికి కంకర టిప్పర్ డ్రైవర్, యజమాని బాధ్యులుగా ప్రభుత్వ అధికారులు విచారణలో తేల్చారు. టిప్పర్ డ్రైవర్ సంఘటన స్థలంలోనే మృతిచెందడం వల్ల టిప్పర్ డ్రైవర్‌పై చర్యలకు రంగం సిద్ధం చేశారు. ఆర్టీసీ బస్సులో 17మంది మృత్యువాత పడితే కేవలం టిప్పర్ యజమానినే బాధ్యున్ని చేసి అధికారులు చేతులు దులుపేసుకున్నారని విమర్శలు వస్తున్నాయి.

ఫైర్ సేఫ్టీ పరికరాలు లేకుండా ఆసుపత్రులు, కాలేజీలు, స్కూళ్లు, ఇతరత్రా వ్యవహారాలు కొనసాగిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇలాంటి ప్రదేశాలలో విలువైన ప్రాణాలు గాలిలో కలిస్తేగానీ అధికారులు స్పందించలేరా అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ఏటా రూ.కోట్ల టర్నోవర్ చేస్తూ పేదల రక్త మాంసాలతో వ్యాపారం చేసే నర్సింగ్‌హోమ్‌ల నిర్వాహకులు ఫైర్‌సేఫ్టీ నిబంధనలను తుంగలో తొక్కేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం జిల్లాలో ఉన్న నర్సింగ్‌హోమ్‌లు, ఆసుపత్రులలో చాలా వరకు ఫైర్‌సేఫ్టీ పరికరాలను ఏర్పాటు చేయలేదని తెలుస్తున్నది. విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు గుంజుతున్న ప్రైవేటు కళాశాలలు, కాన్వెంట్ స్కూళ్ల నిర్వాహకులు కూడా నిబంధనలను విస్మరిస్తున్నారు. షాపింగ్ మాళ్ల యాజమాన్యాలు, లఘు పరిశ్రమల నిర్వాహకులు కూడా ఫైర్ సేఫ్టీపై పెద్దగా పట్టించుకోవడం లేదు. ఒకవేళ అగ్నిమాపక అధికారుల నుంచి ఒత్తిడి వస్తే నామమాత్రపు పరికరాలను అమర్చుకుంటూ చేతులు దులుపుకొంటున్నారు. తక్కువ ఖర్చు చేసి ఎగ్జిటింగ్ విషర్స్‌ను ఏర్పాటు చేసుకుని కాలం గడుపుతున్నారు.



**నిబంధనలు ఇలా..**

సెల్లార్‌లు, మొదటి అంతస్తు, రెండో అంతస్తులలో తప్పనిసరిగా ఆధునిక పరికరాలను అమర్చుకుని ఫైర్ సేఫ్టీ నిర్వహించాలి. భవన సముదాయాల్లో కాన్వెంట్ స్కూళ్లు, కళాశాలలు, నర్సింగ్‌హోమ్‌లు, సూపర్‌మార్కెట్లు, షోరూములు నడుపుతున్నారు. ఆయా యజమానులు 6 నుంచి 10 లక్షల రూపాయల మేరకు ఖర్చు చేసి స్ప్రింక్లర్ల విధానం ద్వారా మంటలార్పే అగ్నిమాపక పరికరాలు అమర్చుకోవాలి. బోరుబావి ద్వారా భారీ ఇంజన్ ఏర్పాటు చేయాలి. ప్రమాదాలు సంభవించిన వెంటనే ఆటోమేటిక్‌గా స్ప్రింకర్లు తెరుచుకుని నీటిని చల్లి మంటలు ఆర్పుతాయి. ప్రతి గదికి పైపులైన్ ఉండటం వల్ల పెద్దగా నష్టం వాటిల్లదని అంటున్నారు. దరఖాస్తు చేసుకున్న సంస్థలకు ఆయా భవనాల అనుకూలత ఆధారంగా అధికారులు అగ్నిమాపక కేంద్ర అధికారులు ఎన్‌వోసి ఇస్తారు. ప్రతి భవనానికి విశాలమైన ప్రహరీగోడ ఉండాలి. ప్రమాదాలు జరిగితే మంటలు ఆర్పే సౌకర్యాలు ఉంటేనే ఎన్‌వోసి అందజేస్తారు. జిల్లా, రీజినల్ స్థాయి ఫైర్ అధికారులు నిరభ్యంతర సర్టిఫికేట్‌ను అందజేస్తారు. జిల్లాలో కొన్ని నర్సింగ్‌హోమ్‌ల యాజమాన్యాలు మాత్రమే నిబంధనలు మేరకు ఉన్నాయి. మిగిలిన నర్సింగ్‌హోమ్‌లు, ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు కేవలం నీటి తొట్టెలు, ఎగ్జిటింగ్ విషర్స్‌ను మాత్రమే ఏర్పాటు చేసుకున్నాయి. సినిమా హాళ్లకు కూడా అత్యాధునిక పరికరాలు అమర్చుకోవాలి. గతంలో అనేక సంస్థలకు ఫైర్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇటీవల కాలంలో పర్యవేక్షణ సరిగ్గా లేదని విమర్శలు వస్తున్నాయి. మూడవ నోటీసులకు స్పందించని సంస్థలపై చర్యలు తీసుకునే అధికారాలు వారికి ఉన్నాయి. కానీ ఇప్పటి వరకూ నామమాత్రపు

## బాలికల ఔదార్యం..

### పాకెట్ మనీతో చిన్ని పాపలకు సాయం..

### జంగం శ్రీకాంత్ కుటుంబానికి లక్కాకుల గాయత్రి రమ్య, రవళి రూ.2,700 సాయం

### ఇద్దరు పాపలు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్ష

**షాద్‌నగర్, డిసెంబరు 29, ప్రభాతవార్త :** ఆసుపత్రిలో వైద్యం కోసం ఎదురుచూస్తున్న లోకం తెలియని ఇద్దరు పసికందులకు తమ వంతు సహాయంగా విట్టరు బాలికలు రూ.2,700 అందించారు. పట్టణానికి చెందిన జర్నలిస్ట్ లక్కాకుల రమేష్ కూతుళ్లు లక్కాకుల గాయత్రి రమ్య, రవళి తమ పాకెట్ మనీ ద్వారా చిన్నారుల కోసం ఈ మొత్తాన్ని ఫోన్పే ద్వారా పసికందుల తండ్రి శ్రీకాంత్ పూజారి కి అందించారు. చిన్నతనంలోనే సేవా కార్యక్రమాలు అలవర్చుకుంటూ సాయాన్ని అందిస్తున్న ఈ బాలికలు ప్రశంసలు అందుకుంటున్నారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మద్ది గట్ల గ్రామానికి చెందిన పూజారి జంగం శ్రీకాంత్ కు 8 సంవత్సరాలకు పుట్టిన కవల పిల్లలు ప్రస్తుతం ఆసుపత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్థిక పరిస్థితి బాగాలేని కారణంగా తనకు సాయం చేసి చిన్నారులను రక్షి ంచాలని పూజారి కోరిన నేపథ్యంలో ఈ మేరకు బాలికలు స్పందించడం విశేషం. బాధిత పిల్లలకు సహాయం చేయాలనుకునేవారు దయచేసి ఈ నెంబర్లకు డబ్బులు పంపించండి. 6305108368 ప్రియాంక, 9908362682 నాగేశ్వరరావు, 8790558670 ఉమా శంకర్, 9581453357 కార్తీక్ నంబర్లకు ఫోన్ పే లేదా గూగుల్ పే చేయగలరు.



లక్కాకుల గాయత్రి రమ్య, రవళి

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

**శంకర్‌పల్లి, డిసెంబరు 29, ప్రభాతవార్త :** ల్యాండ్ పుల్లింగ్ లో తాము కోల్పోయిన మోకిల మోకిలతాండ భూములకు సంబంధించిన ప్లాట్ల కేటాయింపు లో రెవెన్యూ అధికారులు చేతివాటమ్ ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తు మోకిల తాండ, పొన్నగుట్ట తాండ వాసులు శంకర్ పల్లి తహసీల్దారు కార్యాలయం ముందు ఆందోలన చేపట్టారు. తామ భూములు కోల్పోతే ఇతరులకు ప్లాట్లను ఎలా కేటాయిస్తారని సీపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య తో కలిసి తహసీల్దారును ప్రశించారు. తమ భూముల విషయంలో అధికారులు న్యాయం చేయాలనీ లేనిపక్షంలో అందోలనలు చేస్తామని హెచ్చరించారు. తమ భూములు తమకే చెందాలని రైతులతో కలిసి సిపిఐ నాయకులు నినాదాలు చేశారు. మోకిలా ప్రాంతంలో అధికార బలం, అంగ బలంతో పలువురు నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నట్లు సిపిఐ నాయకులు ఆరోపించారు. మోకిలా గ్రామం సర్వేనెంబర్ 96 లో తమకు వారసత్వంగా 5ఎకరాల 02 గుంటల భూములకు గాను ఎకరానికి 750 గజాల స్థలాన్ని మొదటి ఫేజ్ ల్యాండ్ పుల్లింగ్ ఇస్తామని ఇప్పటివరకు ఇవ్వలేదని వాపోయారు. మూడు సంవత్సరాలుగా తహసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగిన ఆవేదనను వినకుండా, తమ స్థానంలో బేబీ నార్య అనే మహిళ పేరు పై ప్లాటు కేటాయించాలని వాపోయారు. విషయం తెలిసి తాసిల్దార్ లో ప్రశ్నించగా బేబీ పేరు తొలగించాలి తప్ప తమ పేర్లపై ప్లాట్లను కేటాయించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాలమాకుల జంగయ్య, రైతులు డెగావత్ శంకర్, డెగావత్ అబ్రియా , కిషన్, రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## దేవేందర్‌గౌడ్‌కు ఘట్‌కేసర్ నాయకుల స్వాగతం

**ఘట్‌కేసర్, డిసెంబరు 29, ప్రభాతవార్త :** యాదాద్రి వెళ్తున్న మాజీ హోంశాఖ మంత్రి-మాజీ ఎంపీ తూళ్ల దేవేందర్‌గౌడ్, ఆయన తనయుడు బిజెపి రాష్ట్రప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్‌గౌడ్‌లకు ఘట్‌కేసర్ నాయకులు స్వాగతం పలికారు. ఘట్‌కేసర్ బైపాస్ రహదారి శ్రీవందన హోటల్ వద్ద స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు వారికి స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. దేవేందర్‌గౌడ్ కుటుంబసభ్యులతో కలిసి సోమవారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వెళ్లారు. ఈసందర్భంగా ఘట్‌కేసర్ నాయకులు దేవేందర్‌గౌడ్, వీరేందర్‌గౌడ్‌ను కలుసుకొని కొద్ది సేపు మాట్లాడారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిపిలు బండారి శ్రీనివాస్‌గౌడ్, ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచులు వేముల సంజీవగౌడ్, వరిగంటి వెంకటేశ్‌గౌడ్, మాజీ ఎంపిటిసి మేకల నర్సింగ్‌రావు, సొసైటీ మాజీ చైర్మన్లు సార శ్రీనివాస్‌గౌడ్, దొంకెన బిక్షపతిగౌడ్, జేఏసీ కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి, మాజీ కౌన్సిలర్ బండారి అంజనేయులు, మాజీ ఉపసర్పంచ్ కొమ్మిడి దామోదర్‌రెడ్డి, ఆర్‌బిఎస్ మాజీ సమన్వయకర్త కందకట్ల పద్మారెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు కాలేరు రామోజీ, మున్సిపల్ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గొంగళ్ల బాలేశ్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి చెల్లక శ్రీధర్, మండల మాజీ ప్రధానకార్యదర్శి కొటగిరి ప్రభంజన్‌గౌడ్, బిజెవైఎం అధ్యక్షులు కొమ్మిడి విక్రాంత్‌రెడ్డి, టిడిపి ప్రధాన కార్యదర్శి టి.మహేశ్‌బాబు, పి.సురేందర్‌రెడ్డి, డి.రాజాచారీ, డి.బాల్‌నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో మాజీ మంత్రి దేవేందర్‌గౌడ్, బిజెపి జీఎస్ వీరేందర్‌గౌడ్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

## ఘట్‌కేసర్ డిసి వాణికి సిబ్బంది సన్మానం

**ఘట్‌కేసర్, డిసెంబరు 29, ప్రభాతవార్త:** జిహెచ్ఎంసీ ఘట్‌కేసర్ సర్కిల్ ఉపకమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అల్లూరి వాణీని సిబ్బంది సన్మానించారు. కార్యాలయంలోని సమావేశపుహాలులో సోమవారం డీసీ వాణీ పోచారం, ఘట్‌కేసర్, నాగారం మున్సిపల్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించగా సిబ్బంది పరిచయం చేసుకున్నారు. ఈసందర్భంగా సర్కిల్ పరిధిలోని నాగారం, ఘట్‌కేసర్, పోచారం, ఎదులాబాద్ డివిజన్ల కాలనీల్లో పారిశుద్ద్య నిర్వహణ, చెత్తసేకరణ, మంచినీటి సరఫరా, రికార్డుల నిర్వహణ. పరిపాలనా తదితర విషయాలపై డీసీ సమీక్ష జరిపి అవసరమైన సూచనలు చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులు, బిల్‌కలెక్టర్లు డీసీ వాణీని శాలువాతో సన్మానించి పూల మొక్కలను అందజేశారు.

## డ్రగ్స్ విక్రయించడానికి యత్నించిన యువకుని అరెస్టు

**సరూర్‌నగర్, డిసెంబర్ 29 ప్రభాతవార్త:**

నూతన సంవత్సర వేడుకలు సమీపిస్తున్న వేళ బాలాపూర్ పోలీసులు బెంగుళూరు నుండి డ్రగ్స్ తెప్పించి విక్రయించడానికి ప్రయత్నించే ఓ యువకు డిని అరెస్టు చేశారు. ఈ మేరకు నిందితుడి వద్ద నుండి 1.6 గ్రాముల నార్కోటిక్స్ డ్రగ్స్ (ఎండిఎం ఎ)ను స్వాధీనం చేసుకొని కేసును నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌కొండాపూర్‌లో నివసిస్తున్న ఆంధ్రప్రదేశ్ పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన నాగిడి జానకీ శ్రీరాం (23) బెంగుళూరు నుండి తన స్నేహితుడు కౌశల్ ద్వారా డ్రగ్స్‌ను తెప్పించాడు. అయితే తన మరో స్నేహితుడు విశ్వా తో కలిసి డ్రగ్స్ తీసుకొనే జానకీ శ్రీరాం దానిని అవరమున్న వారికి విక్రయించి డబ్బులు సంపాదించాలని నిర్ణయానికి వచ్చాడు. ఈ నేపథ్యంలో విశ్వసనీయ సమాచారం అంద డంతో బాలాపూర్ పిఎస్ పరిధిలో నుండి వెళ్తున్న జానకీ శ్రీరాంను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు అతని వద్ద నుండి 1.6 గ్రాముల డ్రగ్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్ చేశారు. ఇన్స్‌పెక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో కేసును దర్యాప్తు చేస్తున్నారు.



## శ్రీవిష్ణు,శివాలయంలో ప్రమాణస్వీకారం చేసిన ఆలయ కమిటీ చైర్మను, ధర్మకర్తలు

### ..రెండవ సారి ఆ కమిటీ వారితో ప్రమాణస్వీకారం చేయించిన దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ ప్రణీత్‌కుమార్ ..నేడు వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వారం ద్వార దర్శనంకు ఏర్పాట్లు

**శామీర్‌పేట, డిసెంబరు 29, ప్రభాతవార్త :** ఉద్దెమర్రిలోని శ్రీవిష్ణు,శివాలయం ఆలయ చైర్మన్‌గా ఆడెపు ఉమామహేశ్వరి, ధర్మకర్తలుగా బూడిద రవీందర్‌గౌడ్, సామల రాజిరెడ్డి, బురిగళ్ల రమేశ్, ఆకుల నాగేశ్, తిగుళ్ల వెంకటేశ్వరశర్మలు ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ కమిటీ చైర్మనుగా, ధర్మకర్తలుగా రెండవ సారి నియమితులైన సందర్భంగ వారితో దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ ప్రణీత్‌కుమార్ వారి చేత ఆలయంలో ప్రమాణస్వీకారం చేయించారు. మూడుచింతలపల్లి మండలంలోని ఉద్దెమర్రి శ్రీవిష్ణు,శివాలయం ఆలయంలో ఆ తరువాత శ్రీవిష్ణు,శివాలయం ఆలయ చైర్మన్, ధర్మకర్తలు పూజలు చేసి శ్రీస్వామి వారిని దర్శించుకున్నారు.

..వైకుంఠ ఏకాదశి సందర్భంగ శ్రీవిష్ణు,శివాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు సిద్ధం చేశారు. మంగళవారం తెల్లవారు జాము నుంచే వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం కల్పించటానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగ ఆలయాన్ని అలంకరించి ముస్తాబు చేశారు. కట్ట నర్సింగ్‌రావు శ్రీస్వామి వారికి పట్టు వస్త్రాలు అందజేశారు. బొల్లారం ప్రాంతానికి చెందిన మహాంకాళి శ్రీధర్‌చారి పూజా ద్రవ్యాలను సమర్పించారు.ఉద్దెమర్రి విశ్వకర్మ సంఘం వారు పూజా ద్రవ్యాలు సమర్పించారు.



శ్రీవిష్ణు,శివాలయంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్, ధర్మకర్తల దృశ్యం

# అధ్వాన్నంగా మారిన పోతారం రోడ్డును బాగుచేయరా..?

### ..గుంతల్లో మట్టి పోసి నిరసన తెలిపిన బిజెపి నాయకులు

**శామీర్‌పేట, డిసెంబరు 29, ప్రభాతవార్త :** పోతారం-అనంతారం గ్రామాల మధ్య రోడ్డు అధ్వాన్నంగా, గుంతలమయంగ మారిందని, కాంట్రాక్టర్ పనులు చేపట్టి మధ్యలో నిలిపి వేశారని దీంతో గ్రామానికి ఆర్టీసి బస్సులు బంద్ అయినట్లు బిజెపి నాయకులు ఆందోళన వ్యక్తం చేసి నిరసనలు తెలియజేశారు. మూడుచింతలపల్లి మండలంలోని పోతారం-అనంతారం గ్రామాల మధ్య గల రోడ్డు పూర్తిగ అధ్వాన్నంగ, గుంతలమయంగ మారిందని, దీంతో పోతారం గ్రామానికి వచ్చే ఆర్టీసి బస్సులు రావటం లేదని రోడ్డు బాగులేదని దీంతో ఆర్టీసి బస్సులను నడపటం లేదని వారు అన్నారు. 2023లో రోడ్డు మరమ్మతు పనులకు నిధులు మంజూరు కావటం, ఎన్నో సార్లు అధికారుల దృష్టికి తీసుకవెళ్లటం, కాంట్రాక్టర్ వచ్చి 4ట్రిప్పుల కంకర పోసి కాలయాపన చేస్తున్నారని వారు విమర్శించారు. ఆర్టీసి ప్రైవేట్ బస్సులు పోతారం గ్రామానికి రావటం లేదని ఈ విషయంపై పలు సార్లు హకీంపేట్ ఆర్టీసి డిఎంకు సమస్య వివరించినా ఎలాంటి ప్రయోజనం లేకుండ పోయిందని అన్నారు. బిజెపి నాయకులు స్థానిక సమస్యగా గుర్తించి రోడ్డుకు ఉన్న గుంతల్లో మట్టి పోసి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, మండల బిజెపి అధ్యక్షులు తెప్పెట్ల నరేందర్‌గౌడ్, మాజీ అధ్యక్షులు నందాల శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి, శ్రీశైలం, ఉపాధ్యక్షులు సింగం విజయలక్ష్మి, వంగ రవీందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పోతారం రోడ్డు అధ్వాన్నంగ మారటంతో గుంతల్లో మట్టి పోస్తున్న బిజెపి నాయకుల దృశ్యం

## వైకుంఠ ఏకాదశి సందర్భంగా వైష్ణవ ఆలయాలు ముస్తాబు



శ్రీరంగనాథస్వామి దేవాలయ దృశ్యం

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 29, ప్రభాతవార్త:**
పోచారం వార్డు పరిధిలోని యంనంపేట్ శ్రీరంగనాథస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని భక్తులకు అన్ని వసతులు కల్పించినట్లు ఆలయ ఈవో ఎల్.భాగ్యలక్ష్మి తెలిపారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు స్వామివారు ఉత్తరద్వారం ద్వారా దర్శనం ఇవ్వడానికి అన్ని ఏర్పాట్లుచేశామని తెలిపారు. భక్తులకు వాహనాల పార్కింగ్‌తో పాటు క్యూలైన్ ద్వారా భక్తులు వెళ్లి సాఫీగా దర్శనం చేసుకోవడానికి ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. తెల్లవారుఝామునుండే స్వామివారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. వెంకటాపూర్ శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంవద్ద భక్తులకు ఏర్పాట్లుచేశామని ఆలయ ఈవో ఎల్.భాగ్యలక్ష్మి తెలిపారు.

## సామాజిక శ్రేయస్సు కోసం స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేస్తాం

**-అనురాగ్ యూనివర్శిటీ డీన్ విజయకుమార్**



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న యాదగిరి తదితరులు

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 29, ప్రభాతవార్త:**
అనురాగ్ యూనివర్శిటీ సామాజిక శ్రేయస్సు కోసం స్వచ్ఛంద సంస్థల పరస్పర సహకార సంబంధాలతో ముందుకు సాగుతుందని యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ వి.విజయ్‌కుమార్ అన్నారు. పోచారం వార్డు పరిధిలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీతో స్ఫూర్తి ఆర్గనైజేషన్ పరస్పర అవగాహన ఒప్పంద పత్రాలను సోమవారం ఇచ్చిపుచ్చుకున్నారు. స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కె.యాదగిరి, కళాశాల డీన్ డాక్టర్ వి.విజయ్‌కుమార్‌లు ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. స్ఫూర్తి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న శాస్త్రీయ ఆలోచనలతో సామాజిక మార్పు కోసం చేపడుతున్న అనురాగ్ యూనివర్శిటీ భాగస్వామ్యం ఉంటుందని తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల పరిష్కారం దిశగా కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అనురాగ్ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్.మల్లేశ్, ప్రొఫెసర్ డి. నరేందర్‌సింగ్, ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, సభ్యులు పరుశురాం, కె.సాయిసూరజ్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు పేదలకు వరం

**-సర్పంచ్ మల్లేష్**



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న నేతలు

**కుల్కచర్ల, డిసెంబరు 29, ప్రభాతవార్త:**
గత పదిసంవత్సరాల నుండి పేదల సొంతింటికల సాకారం కాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు ఇందరమ్మ ఇళ్లతో కల సాకారమవుతుందని, ఇందిరమ్మ ఇళ్లు పేదలకు వరమని సర్పంచ్ మల్లేష్ కాంగ్రెస్ పార్టీ మండల ప్రధానకార్యదర్శి గోపాల్‌నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఇప్పాయిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అర్హులైనవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలు, మల్లయ్య, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపసర్పంచ్‌ని సన్మానించిన శివచరణ్‌రెడ్డి



ఉపసర్పంచ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్‌నేత శివచరణ్‌రెడ్డి

**కేశంపేట, డిసెంబరు 29, ప్రభాతవార్త:**
ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో నిర్దావెల్లి గ్రామ ఉపసర్పంచ్‌గా ఎన్నికైన సపురా అమీర్‌ను సోమవారం హైదరాబాద్ ఎల్బీనగర్‌లో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బక్కిడి శివచరణ్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శివచరణ్‌రెడ్డి మాట్లాడుతూ కష్టపడ్డ వారికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉండి అర్హులైన వారికి పదవులను కట్టపెడుతుంది అని అన్నారు. ప్రజలు నమ్మకంతో మీకు ఓటు వేసి గెలిపించారని ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవ చేయాలని ఆయన సూచిస్తూ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నాగేందర్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి సంతోష్, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, నియోజకవర్గ అధ్యక్షుడు పులిమామిడి రాజేష్, రంగారెడ్డి జిల్లా యువజన సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నట్టలమందు వాడి మూగజీవాలను రక్షించండి

**-కాకునూరు సర్పంచ్, వార్డు సభ్యులు**

**కేశంపేట, డిసెంబరు 29, ప్రభాతవార్త:**
మూగజీవాలకు నట్టల నివారణ మందును వేసి వాటిని రక్షించాలని కాకునూరు గ్రామ సర్పంచ్ బుడ్డ రాజు, వార్డు సభ్యులు సీమల శ్రీనివాస్, వలికే శ్రీనివాస్‌ముదిరాజ్, అరె రాఘవేందర్‌ముదిరాజ్‌లు అన్నారు. సోమవారం కేశంపేట మండల పరిధిలోని కాకునూరు గ్రామంలో సర్పంచ్, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో గ్రామంలోని గొరిగె నారాయణకు చెందిన 150గొర్రెలకు, మోటె జగతయ్యకు చెందిన 200గొర్రెలకు నట్టల నివారణ మందులను, పశు వైద్యుడు రాజు ఆధ్వర్యంలో వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూగజీవాలు పశువులు గొర్రెలు మేకలు ఆరోగ్యాన్ని కాపాడడంలో నట్టల నివారణ మందు కీలకంగా పనిచేస్తుందని నట్టల వల్ల మూగజీవాలు నీరసించిపోవడమే కాకుండా వాటి ఎదుగుదల తగ్గిపోతుందని, పాల దిగుబడిరాకుండా తగ్గిస్తుందని రైతులు పశువులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వైద్యుల సలహా మేరకు మూగజీవాలకు సంవత్సరానికి రెండుసార్లు మందులు వేయాలని వారు తెలిపారు.

# అవసరమైన యూరియా ఎరువుల నిల్వలు సిద్ధం

**-రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు**
**-అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవు**
**-మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 29, ప్రభాతవార్త:**
జిల్లాకు అవసరమైన యూరియా ఎరువులు నిల్వలు ఉన్నట్లు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి స్పష్టం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో ఉన్న యూరియానిల్వలు సాగుకు సరిపోతాయని, అవసరాన్నిబట్టి మరిన్ని సరఫరాలు క్రమం తప్పకుండా అందుతున్నాయని రైతులకు భరోసా కల్గించారు. జిల్లాలో ఇప్పటివరకు 773 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రైతులకు ఇబ్బంది లేకుండా ప్రతి సెల్ కౌంటర్ వద్ద షామియానాలు, త్రాగునీటి సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఉదయం 6గంటల నుంచి కౌంటర్ వద్ద యూరియా సెల్స్ ప్రారంభించాలని అన్నారు. యూరియా పంపిణీపై సంబంధిత అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించటం, అధిక ధరలకు విక్రయించటం వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. రైతులు ఎవరైనా యూరియా సరఫరాలో సమస్యలు ఎదుర్కొంటే సమీప వ్యవసాయ అధికారులను సంప్రతించాలని ఆయన సూచించారు. అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా శాస్త్రీయ పద్ధతిలో వినియోగించాలని కలెక్టర్ రైతులకు సూచించారు.

# కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం

**-ప్రజల నుంచి అందిన 115 ఫిర్యాదులు**
**-రెవెన్యూ అధికారిణి హరిప్రియ స్వీకరణ**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 29, ప్రభాతవార్త:**
జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కోసం వచ్చిన ప్రజల నుంచి మేడ్చల్ జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్‌ఓ) హరిప్రియ ఫిర్యాదులను స్వీకరించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 115ఫిర్యాదులు అందినట్లు డిఆర్‌ఓ హరిప్రియ తెలిపారు. జిల్లా లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి ఆమె ఫిర్యాదులను ప్రజల నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓ హరిప్రియ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులకు సంబంధిత శాఖల అధికారులు స్పందించి తక్షణమే వాటిని ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడ సంబంధిత శాఖాధికారులు క్లియర్ చేయాలని సూచించారు. అదేవిధంగా సిఎంఓ ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను కూడా త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈకార్యక్రమంలో జిల్లా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన డిఆర్‌ఓ హరిప్రియ, జిల్లా అధికారులు

## విద్యారంగ సమస్యలపై ఎబివిపి అలుపెరుగని పోరాటం



ఆమనగల్లులో గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎబివిపి శ్రేణులు

**ఆమనగల్లు, డిసెంబరు 29, ప్రభాతవార్త:**
విద్యారంగ సమస్యలపై అఖిల భారత విద్యార్థి పరిషత్ నాటి నుండి నేటి వరకు అలుపెరుగని పోరాటం చేస్తుందని ఎబివిపి గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గ సభ్యులు పురుగుల శివ అన్నారు. అనేక సమస్యలకు పరిష్కారం చేసిన ఘనత ఎబివిపికి దక్కుతుందన్నారు. త్వరలో జరిగే 44వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన మండల ప్రచార వాల్ పోస్టర్‌ను సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, ఎబివిపి నాయకులతో కలిసి ఆమనగల్లు ఎబివిపి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు లండం మల్లేష్‌తో కలిసి ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఎబివిపి చెన్నంశెట్టి మల్లేష్, ఎడవల్లి అంజి నేనవత్ సుమన్, నేనవత్ తరుణ్, సన్ని, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ ఆందోళన

**-మేడ్చల్ కలెక్టరేట్ వద్ద బిసి హక్కుల పోరాట సమితి నాయకుల ధర్నా**




కలెక్టరేట్ వద్ద ధర్నాచేసిన జిల్లా బిసి హక్కుల పోరాట సమితి నాయకులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 29, ప్రభాతవార్త:**
బిసిలకు విద్యా, ఉద్యోగాల్లో 42శాతం రిజర్వేషన్లు ప్రభుత్వం అమలు చేయాలంటూ మేడ్చల్ జిల్లా బిసిహక్కుల పోరాటసమితి నాయకులు ఆందోళన వ్యక్తంచేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌వద్ద బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలుచేయాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, ధర్నా చేశారు. ఆతరువాత కలెక్టరేట్ ప్రజావాణిలో వినతిపత్రాన్ని డిఆర్‌ఓ హరిప్రియకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా బిసిహక్కుల పోరాటసమితి నాయకులు విలేకరులతో మాట్లాడుతూ గత నెలలో బిసి రాష్ట్ర వ్యాప్త బంద్‌ను నిర్వహించి ఉద్యమ తీవ్రతను తెలియజేయటం జరిగిందన్నారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని తీర్మానంచేసి 9వషెడ్యూల్‌లో చేర్చి పార్లమెంట్‌లో ఆమోదించేలా అఖిలపక్షం బిసినాయకులను ఉద్యమానికి సమాయత్తం చేయాలన్నారు. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర బిజెపి ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేలా కార్యచరణ రూపొందించాలని కోరారు. బిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా బిసి అధ్యక్షులు అంబటి బాపిరాజు, స్టేట్ సిపిఐ కంట్రోల్ కమిషన్ మెంబర్ డిజి సాయిలుగౌడ్, బిసిహక్కుల పోరాటసమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ దశరథ, కదారి ప్రమీల, జిల్లా కార్యదర్శి గాలి కృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శులు డిజి నరేంద్రప్రసాద్, డి.జంగయ్య, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు జె.లక్ష్మి, జిల్లా ప్రచారకార్యదర్శి మహాలక్ష్మి, జిల్లా కార్యవర్గసభ్యులు కమ్మరి మనోచారి, సహాయ కార్యదర్శి, కార్యవర్గ సభ్యులు కాశిరాజు, నరసమ్మ, ఎడమ వెంకటేశ, అనుపరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఆసెంబ్లీ సమావేశాలప్పుడు అక్రమ అరెస్టులు ఏంటి?

**-కొత్తపేట మాజీ సర్పంచ్ కామ్లెకార్ నవీన్‌కుమార్**



మాజీ సర్పంచ్ నవీన్‌కుమార్‌ను అరెస్టుచేసిన పోలీసులు

**కేశంపేట, డిసెంబరు 29, ప్రభాతవార్త:**
అసెంబ్లీ సమావేశాలప్పుడు అక్రమంగా అరెస్టుచేసి ప్రతిపక్షం గొంతునొక్కి ప్రభుత్వాన్ని నడపలేరని, అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన ప్రతిసారి తమను అక్రమ అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసం అని కొత్తపేట మాజీ సర్పంచ్ కామ్లెకార్ నవీన్‌కుమార్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల దృష్ట్యా, ముందస్తుగా కేశంపేట పోలీసులు నవీన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించలేని, ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ ప్రజాప్రతినిధులను అక్రమ అరెస్టులు చేయడం సరికాదన్నారు. తన పిల్లలను షాద్‌నగర్‌లోని పాఠశాల వద్ద వదిలేందుకు వెళ్లగా సెల్‌ఫోన్ సిగ్నల్ లొకేషన్ ట్రేస్‌చేసి అదుపులోకి తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే మాజీసర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించి, రైతులకు ఎరువులు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉద్యోగులకు సకాలంలో జీతభత్యాలు, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతోకాలం మనుగడలో ఉండదని విమర్శలు గుప్పించారు.

## గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

**-నూతన సర్పంచ్ దత్తాత్రేయరావుకు సన్మానం**



నూతన సర్పంచ్‌ను సన్మానిస్తున్న ఆయుష్మాన్ మందిర్ డాక్టర్

**కొడంగల్, డిసెంబరు 29, ప్రభాతవార్త:**
మండలంలోని చిన్ననందిగామ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానని, ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతానని నూతనంగా ఎన్నికైన దత్తాత్రేయరావు అన్నారు. నూతన సర్పంచ్ దత్తాత్రేరావును సోమవారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ డాక్టర్ మహేందర్,ఏఎన్ఎం బొంకూర్ అనురాధ శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న వైద్య సిబ్బందిని అభినందించారు. సబ్‌సెంటర్‌లో ఉన్న సమస్యలపై ఆరీ తీసి వివరాలు సేకరించారు. సెంటర్‌కి కావాల్సిన సామాగ్రిని ఉచితంగా అందజేశారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో బోధన అభ్యాసన అంశాలపై మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు బల్వంత్ రెడ్డి(రాజు), ఆశాకార్యకర్తలు లలిత, రాములమ్మ, మేఘమాల పాల్గొన్నారు.

# మండల అధికారుల సమీక్షాసమావేశం




సమావేశంలో ఎంపిడివో రాధారాణి, వివిధ శాఖల అధికారులు

**యాచారం, డిసెంబరు 29, ప్రభాతవార్త:**
యాచారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడివో రాధారాణి అధ్యక్షతన వివిధ శాఖల మండల అధికారులతో సమీక్షాసమావేశం సోమవారం నిర్వహించారు. పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, ఉపాధి హామీ, మహిళా సమైక్య, పశు సంవర్ధక శాఖల అధికారులతో సమీక్షాసమావేశం ఏర్పాటు చేశారు. సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ.. అభివృద్ధి పనులన్నీ సకాలంలో చేయాలన్నారు. పెండింగ్లో ఉన్న బిల్లులని తక్షణమే చెల్లించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పనుల వేగవంతం చేయాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించి గ్రామాలన్ని ఆదర్శంగా తీర్చి దిద్దాలన్నారు. పశువుల షెడ్డు, పౌల్ట్రీ ఫారాల, తదితర సంక్షేమ పథకాలు అన్నీ సకాలంలో పూర్తి చేసి లబ్దిదారులకు బిల్లులు అందేలా అధికారులు కృషి చేయాలి అన్నారు. నూతన సర్పంచులు గ్రామపంచాయతీ కార్యదర్శులు సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో అభివృద్ధి దిశగా నడుచుకోవాలని సూచన చేశారు.

ఈ కార్యక్రమంలో మండల పశు సంవర్ధక శాఖ అధికారిణి రేఖ, మండల పంచాయతీ అధికారులు, ఎపిఎం రవీందర్, ఎపివో లింగయ్య, వివిధ గ్రామ పంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## జులపల్లి క్లీన్ అండ్ గ్రీన్ మిషన్



చెట్లునరికి రోడ్ క్లీన్ చేయిస్తున్న సర్పంచ్ శేఖర్

**తలకొండపల్లి, డిసెంబరు 29, ప్రభాతవార్త:**
గ్రామ సర్పంచ్ కదారి శేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో, డిప్యూటీ సర్పంచ్ ఇంద్రకంటి శ్రీశైలమ్‌గౌడ్, వార్డుసభ్యులు వి.రాఘవేందర్‌ముదిరాజ్, బి.అశ్షోక్, జి.అల్లాజీగౌడ్, జి.జగదీశ్‌గౌడ్, రాజు నాయక్‌ల పర్యవేక్షణలో ఈ రోజు జులపల్లి - నిద్రవల్లి మధ్య రోడ్డుకు ఇరువైపులా పెరిగి, రహదారిని అడ్డుకుంటూ, ప్రయాణికులకు అంతరాయం కలిగిస్తున్న చెట్టు కొమ్మలు, పొదలు, రహదారి పక్కన పేరుకు పోయిన చెత్తను ట్రాక్టర్ సహాయంతో శుభ్రపరచడం జరిగింది. అదేవిధంగా దెబ్బతిన్న రహదారి భాగాలకు ప్యాచ్‌వర్క్ చేయడంద్వారా మరమ్మతులు చేపట్టారు. ఈ పనులను జులపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ కె.శేఖర్‌యాదవ్ పూజ కార్యక్రమంతో ప్రారంభించి, కొత్త దృక్పథంతో గ్రామ అభివృద్ధికి తొలి అడుగు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కదారి శేఖర్‌యాదవ్, డిప్యూటీసర్పంచ్ ఇంద్రకంటి శ్రీశైలమ్‌గౌడ్, వార్డుసభ్యులు వి.రాఘవేందర్‌ముదిరాజ్, బి.అశ్షోక్, జి.అల్లాజీగౌడ్, జి.జగదీశ్‌గౌడ్. రాజునాయక్ గ్రామస్థులు పాల్గొన్నారు.

## 24 శాతం హెచ్‌ఆర్‌ఏ చెల్లించాలి

**-జిల్లా ఎస్‌టియు టిఎస్ నాయకులు**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 29, ప్రభాతవార్త**
మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలో ఉన్న మూడు మున్సిపాల్టీలు అలియాబాద్,ఎల్లంపేట్, మూడుచింతలపల్లిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు 24శాతం హెచ్‌ఆర్‌ఏ చెల్లించాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌కు జిల్లా ఎస్‌టియు టిఎస్ జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు బి.వెంకటేశ్వర్లు, ఊరెళ్ల విఠల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.ప్రేమ్‌కుమార్, జిల్లా నాయకులు రామకృష్ణలు విచ్చేసి కలెక్టరేట్‌లో హెచ్‌ఆర్‌ఏ కోసం వినతిపత్రాన్ని అందజేశారు. జిహెచ్‌ఎంసి పరిధి నుంచి 8కిలోమీటర్ల లోపు విధులు నిర్వహిస్తున్న అలియాబాద్, ఎల్లంపేట్, మూడుచింతలపల్లి మున్సిపాల్టీ పరిధిల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు 24శాతం హెచ్‌ఆర్‌ఏ ఇవ్వాలని ప్రభుత్వాన్ని వారు కోరారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## మొక్కు చెల్లించుకున్న సర్పంచ్, వార్డుసభ్యులు



మొక్కులు చెల్లించుకున్న సర్పంచ్, వార్డు సభ్యులు

**కేశంపేట, డిసెంబరు 29, ప్రభాతవార్త:**
కేశంపేట మండల పరిధిలోని కాకునూరు గ్రామ సర్పంచ్‌గా బుడ్డరాజు, వార్డు సభ్యులుగా సీమల శ్రీనివాస్, వలికే శ్రీనివాస్‌ముదిరాజ్, ఆరే రాఘవేందర్‌ముదిరాజ్, దాన్నే రామకృష్ణ, గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు సోమవారం గ్రామ శివారులోని వెలసిన మహా పుణ్యక్షేత్రమైన మహాలింగేశ్వర స్వామి ఆలయానికి చేరుకొని ఎన్నికల ముందు మొక్కిన మొక్కును చెల్లించుకునేందుకు వేకువఝామునే ఆలయానికి చేరుకొని ప్రదక్షిణలు నిర్వహించి అనంతరం 111 కొబ్బరి కాయలను కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు కుమారస్వామి తీర్థప్రసాదాలను ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు. కోరే శంకరయ్య, కరికె నరేష్, చీరే వెంకటయ్య, సొంటే శ్రీశైలం, అనిల్, మల్లేష్, శేఖర్, శ్రీను, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ చీరెల పంపిణీ

**తలకొండపల్లి, డిసెంబరు 29, ప్రభాతవార్త:**
రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెంకటరావుపేట, గడ్డమీది తండా గ్రామ పంచాయతీలలో ఇందిరమ్మ చీరెల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. గ్రామంలోని మహిళలకు చీరలను పంపిణీ చెయ్యడం జరిగింది. ఈసందర్భంగా మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమపథకాలు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. అనంతరం గ్రామ మహిళాసంఘం సభ్యులకు చీరెలు అందజేశారు. కార్యక్రమంలో వెంకట్రావుపేట్ గ్రామసర్పంచ్ ఇమ్మడి మహేష్, గడ్డమీదితండా సర్పంచ్ భణావత్ సరోజాభీమ్లాల్, పంచాయతీ కార్యదర్శి జమీర్, ఉపసర్పంచ్ పోలే ప్రశాంత్, వార్డు సభ్యులు చప్పిడి హుస్సేన్, సంతోష రాజు, శంకరయ్య, శ్రీను, అరుణ, బుక్ కీపర్, గ్రామ మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పల్లెల్లో రెండవ ఆదాయవనరు మూగజీవాలు

**-సర్పంచ్ చేదురువల్లి భాస్కర్‌గౌడ్**

**కేశంపేట, డిసెంబరు 29, ప్రభాతవార్త:**
పల్లెల్లో వ్యవసాయం తర్వాత రెండవ ఆధారంగా పాడి పశువులు గొర్రెలు, మేకలు, బర్రెలు ఆవులపైనే ఆధారపడి గ్రామీణ ప్రజలు జీవిస్తూ ఉంటారని నిర్దావెల్లి గ్రామ సర్పంచ్ చేదురువల్లి భాస్కర్‌గౌడ్ అన్నారు. సోమవారం గ్రామంలోని 148 గొర్రెలకు 70 మేకలకు పశు ఆధ్వర్యంలో నట్టలనివారణ మందులనువేశారు. కార్యక్రమంలో వెటర్నరీ ఆఫీసర్ రాజీవ్ ఫైలెట్ వార్డుసభ్యులు రమేష్, రొయ్యల మంజుల, జంగేశ్, బిఆర్ఎస్ గ్రామకమిటీ అధ్యక్షుడు కొత్త శ్రీశైలం, ఉపాధ్యక్షులు కాజా పాషా, టిఆర్ఎస్‌నాయకులు బడక మల్లయ్య, దిద్దెల ముత్యాలు, దిద్దెల జంగయ్య, ఆకుల రామకృష్ణ, ఎండి మక్బూల్, దిద్దెల శేఖర్, దయ్యాల శ్రీశైలం, దయ్యాల శంకరయ్య, గొరిగే శంకరయ్య, గొరిగే రోశయ్య, శ్రీను, గుత్తి మల్లేష్, వెంకటేష్, కొత్త వెంకటయ్య పాల్గొన్నారు.

## ఆడబిడ్డలకు ప్రభుత్వ సారెగా ఇందిరమ్మ చీరెలు

**-సర్పంచ్ ఎర్రల్ల జగన్**

**కొత్తూరు, డిసెంబరు 29, ప్రభాతవార్త:**
మహిళా సంక్షేమానికి సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అంకితభావం రాష్ట్రంలోని ఆడబిడ్డలకు ప్రభుత్వ సారెగా అందిస్తున్న ఇందిరమ్మ చీరెలు మహిళలకు గౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని అందిస్తున్నాయని పెంజర్ల గ్రామ సర్పంచ్ ఎర్రల్ల జగన్ అన్నారు. కొత్తూరు మండలంలోని పెంజర్ల గ్రామంలో సోమవారం మహిళలకు ఇందిరమ్మ చీరెల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ జగన్ మాట్లాడుతూ.. మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. మహిళల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. సొంత ఇల్లులేని మహిళలకు ఇందిరమ్మ ఇళ్లమంజూరు వంటి పథకాలు మహిళలకు ఆర్థికభరోసా కల్పిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ కాజా, ఉప సర్పంచ్ మామిడి శంతన్‌రెడ్డి, వార్డు సభ్యులు కె.రమాదేవి, ఎ.మాధవి, ఎం.మాధవి, కె.వేదాంతచారి, కె.మహబూబ్, జి.మామిడి ప్రవీణ్‌రెడ్డి, లెకం కృష్ణముదిరాజ్, మంజుల, రేణుకాదేవి, కోళ్ల లక్ష్మి, అంగన్‌వాడీ ఇందిరమ్మ గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసు నమోదు

**తలకొండపల్లి, డిసెంబరు 29, ప్రభాతవార్త:**
తలకొండపల్లి ఎస్ఐ ఎ.శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం- చంద్రధన గ్రామానికి చెందిన ఆవుల భారతమ్మ ఆదివారం ఉదయం ఇబ్రహీంపట్నంలోని బంధువుల ఇంట్లో పూజ ఉన్నందున అక్కడికి వెళ్ళింది. తిరిగి సోమవారం ఉదయం 10 గంటలకు ఇంటికి రాగా ఇంటికి ఉన్న తాళాలు విరగగొట్టబడి ఉన్నాయి. ఆమె ఇంట్లోకివెళ్లి చూడగా ఇంట్లో ఉన్న మూడు తులాల బంగారం, 40వేల రూపాయలు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు తెలిపారు. దాంతో ఆమె స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.